విశాఖపట్టణం
మంగళవారం 26 మే 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 122 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## మా సంస్థకే ఈడీ నోటీసులు



నా భార్యకు అందలేదు

లిక్కర్ స్కామ్‌తో సంబంధం లేదు

రియల్ ఎస్టేట్ సంస్థకు సంబంధించి జారీ

విజయవాడ ఎంపీ కేశినాని శివనాథ్ వెల్లడి

2

# వ్యక్తిత్వ హననం చేస్తే తాటతీస్తా

పంచింగ్ బ్యాగ్ లా వాడుకుంటే సహించను

నా సహనానికి కూడా ఓ హద్దు ఉంటుంది

ఎన్నో అవమానాలను, వ్యక్తిగత విమర్శలను భరించా

ప్రొఫెసర్ స్థాయిలో ఉండి పులిహోరా కథలు చెబుతారా

తమిళ రాజకీయాలను చూసి జలసీగా ఉంది

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు




(అమరావతి - జయజయహే)

ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ సోమవారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో చేసిన ప్రసంగం ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా రాజకీయ విశ్లేషణల పేరుతో క్యారెక్టర్ ను కించ పరిచేలా మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో తనను పంచింగ్ బ్యాగ్ లా వాడుకోవడం ఇకపై సాధ్యం కాదని, సహనానికీ ఒక హద్దు ఉ ంటుందని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత పుష్కర కాలంగా తాను ఎన్నో అవమానాలను, వ్యక్తిగత విమర్శలను భరిస్తూ వచ్చానని, కానీ తన మౌనాన్ని బలహీనతగా భావిస్తే ఇకపై ఊరుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. భరిస్తాం, సహిస్తాం.. హద్దులు దాటితే తాట తీస్తాం అంటూ ఆయన ఇచ్చిన హెచ్చరించారు. ప్రముఖ విశ్లేషకులు ఒకరు ఇటీవల చేసిన వ్యాఖ్యలపై పవన్ నేరుగానే విరుచుకుపడ్డారు. అమిత్ షాతో సమావేశం అయ్యామని తనకు, నాదెండ్ల మనోహర్‌కు వ్యతిరేకంగా తప్పుడు నెరేటివ్ నిర్మించే ప్రయత్నం జరుగుతోందని ఆయన మండిపడ్డారు. "ప్రొఫెసర్ స్థాయి వ్యక్తి ఇలాంటి పులిహోర కథలు చెప్పడం శోచనీయం. మేము అమిత్ షాను కలిసినప్పుడల్లా జగన్ రెడ్డిని జైలుకు పంపమని ..మిగతా 2లో



## విలేజ్ టు గ్లోబల్ మార్కెట్

పారిశ్రామిక వేత్తలుగా మహిళలు

ఎంటర్ ప్రన్యూర్ లుగా 5 లక్షలు మహిళలు

ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు ఇన్సెంటివ్

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడి

(అమరావతి - జయజయహే)

ఓ చిన్న ఆలోచనను పెద్ద పరిశ్రమగా మార్చే అవకాశం ఎంఎస్ఎంఈలకు మాత్రమే ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న రంగం ఇదేనని అన్నారు. ఏపీలో వనరులు వినియోగించుకునేలా ఎంఎస్ఎంఈలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎంఎస్ఎంఈ పాలసీతోపాటు ప్రైవేటు పారిశ్రామిక పార్కుల పాలసీలు తీసుకువచ్చామని సీఎం వెల్లడించారు. ఈ సమ్మిట్ ద్వారా స్టార్టప్‌లు, పారిశ్రామిక యూనిట్‌లు, నిపుణులు, బ్యాంకులు ఒకే వేదిక పైకి వచ్చాయన్నారు. వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్ కింద పెద్ద ఎత్తున పారిశ్రామిక యూనిట్‌లు ఏర్పాటు కావాలని సీఎం సూచించారు. 500 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలు కూడా ఇప్పటికే విడుదల చేశామన్నారు. 200 కోట్లతో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ కూడా ప్రారంభిస్తున్నాని ..మిగతా 2లో

# గోదావరి కలుషితంపై టాస్క్ ఫోర్స్

క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసి నివేదిక

నదుల సంరక్షణకు యాక్షన్ ప్లాన్

పుష్కరాలకు రూ. 100 కోట్ల బడ్జెట్

హోం స్టేతో పాటుగా విస్తృత వసతులు

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాలు

పుష్కరాల సన్నద్ధతపై అధికారులతో సమీక్ష



(రాజమహేంద్రవరం - జయజయహే)

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో గోదావరి నది కాలుష్యం, పుష్కరాల సన్నద్ధతపై పీసీబీ, అటవీ-పర్యావరణ శాఖ, పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిశీచారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ పాల్గొన్నారు. 'మన దాహం తీర్చి, మనకు జీవితాన్ని ఇచ్చే పవిత్రమైన జీవ నదులను మనమే చేతులారా చంపేస్తూ, వాటిని మృత నదులుగా మారుస్తున్నాం' అని ఉప ముఖ్యమంత్రి, ..మిగతా 2లో

## సీబీఐ విచారణ చేయాలి

మెగా డీఎస్సీలో అక్రమాలు

నియామక ప్రక్రియ పెద్ద స్కామ్.. నిరుద్యోగులను దగా చేసారు

టాపర్ డేటా బేస్ ను ఎందుకు డిలీట్ చేసారు

మంత్రి నారా లోకేశ్ డార్క్ ఆపరేషన్

మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్

( తాడేపల్లి - జయజయహే)



గత ఏడాది పూర్తి అయిన మెగా డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నియామక ప్రక్రియలో పారదర్శకత లోపించిందని, ఇదంతా ఒక పెద్ద స్కామ్ అని జగన్ తాజాగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పేపర్లు లీక్ అవ్వడం, మెరిట్ లిస్టులు మాయం కావడం, డేటా డిలీట్ చేయడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ.. ఇది మెగా డీఎస్సీనా లేక నిరుద్యోగులను మోసం చేసిన 'దగా డీఎస్సీనా' అని ..మిగతా 2లో



## డ్వాక్రాలకు రూ. 10 లక్షల రుణం

ఎలాంటి పూచీకత్తు అవసరం లేదు

ఎంఎస్ ఎంఈ యూనిట్లు ఏర్పాటుకు ఛాన్స్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

డ్వాక్రా మహిళలకు శుభవార్త. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కీలక ప్రకటన చేశారు. రూ.10 లక్షల వరకు మహిళలకు రుణం మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. ఎలాంటి పూచీకత్తు అవసరం లేకుండానే రూ.10 లక్షల వరకు వ్యక్తిగత రుణం మంజూరు చేస్తామని తెలిపారు. అర్హులైన డ్వాక్రా మహిళలు ఈ రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళలు ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు ఈ రుణాన్ని మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. దీన్ దయాల్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి కార్యక్రమం కూడా ఈ లోన్ మంజూరు ..మిగతా 2లో

# మళ్లీ.. మళ్లీ.. బాదుడు

కొనసాగనున్న ధరల మంట

లాభల్లో ఉన్న కంపెనీలది అదే దారి

తాజాగా లీ. పెట్రోల్ పై రూ. 2.61 పెంపు

లీ. డీజిల్ పై 2.71 పెరుగుదల




(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారతదేశంలో ఇంధన ధరల మంట కొనసాగుతోంది. సోమవారం లీటరు పెట్రోల్‌పై రూ. 2.61, డీజిల్‌పై రూ. 2.71 చొప్పున పెంచాయి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు. తాజా పెంపుతో దేశ రాజధాని దిల్లీలో నాలుగేళ్ల తర్వాత మొదటిసారి పెట్రోల్ ధర రూ. 100 మార్కును దాటింది. ప్రస్తుతం అక్కడ లీటరు పెట్రోల్ రూ. 102.12, డీజిల్ రూ. 95.20 వద్ద సేల్ అవుతోంది. గడిచిన రెండు వారాల లోపే పెట్రోల్, డీజిల్ ధరలు నాలుగుసార్లు పెరిగాయి. దీనితో మే 15 నుంచి ఇప్పటివరకు మొత్తంగా పెట్రోల్‌పై రూ. 7.35, డీజిల్‌పై రూ. 7.53 వరకు భారం పడింది. అమెరికా-ఇరాన్ యుద్ధ వాతావరణం, హోర్ముజ్ జలసంధి గుండా చమురు రవాణా నిలిచిపోవడమే దేశంలో ఇంధన ధరల పెంపునకు కారణం. అయితే, రానున్న రోజుల్లో ఈ రేట్లు ఇంకా పెరగొచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. భారతదేశంలో ఇంధన ధరలు అకస్మాత్తుగా పెరగడానికి అంతర్జాతీయ చమురు రవాణా మార్గమైన ..మిగతా 2లో

## రైతు రుణమాఫీ

తమిళనాట సీఎం విజయ్ సంచలనం

సహకార బ్యాంకుల రుణాలకు ఊరట

సుమారు 14,22,555 మంది రైతులకు రిలీఫ్

ప్రభుత్వంపై రూ. 2,044.46 కోట్ల అదనపు ఆర్థిక భారం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



తమిళనాడులో రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి డా. సి. జోసెఫ్ విజయ్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని సహకార బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందిన లక్షలాది మంది రైతులకు ఊరటనిస్తూ భారీ రుణమాఫీని ప్రకటించారు. సోమవారం సచివాలయంలో వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులు , ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షా సమావేశం ..మిగతా 2లో

# వ్యక్తిత్వ హననం చేస్తే తాటతీస్తా

మొదటి పేజీ తరువాయి...

కోరుతున్నట్లు చిల్లర ప్రచారం చేస్తున్నారు. అసలు జగన్ రెడ్డి జైలుకు వెళ్తే మాకేం లాభం? దేశాన్ని శాసించే పెద్దల దగ్గరకు మేము వెళ్ళేది ఏపీ అభివృద్ధి కోసం, నిధుల కోసం తప్ప ఇలాంటి కేసుల సెటిల్మెంట్ల కోసం కాదు" అని పవన్ కుండబద్దలు కొట్టారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ ఒక పథకం ప్రకారం తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీయాలని చూస్తే సహించబోనని పవన్ హెచ్చరించారు. "నాకు కులం, ప్రాంతం అంటగడుతున్నారు. కానీ నేను తిరిగి సమాధానం ఇస్తే మాత్రం మీకు కులం గుర్తొస్తుందా? మేధావులమని చెప్పుకునే వారు తమ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతుంటే మేము చేతులు కట్టుకుని కూర్చోవాలా?" అని ఆయన ప్రశ్నించారు. సామాన్య మనుషుల్లాగే తమకూ ఆవేశం, కడుపు మంట ఉంటాయని, ఇకపై ప్రతి విమర్శకు అదే స్థాయిలో కౌంటర్లు ఉంటాయని స్పష్టం చేశారు. నేను అమిత్ షాతో మాట్లాడిన విషయాలు బయటవాళ్లకు ఎలా తెలుస్తాయి? ఏపీ బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. 'నేను అన్నింటికీ తెగించే రాజకీయాల్లోకి వచ్చాను. శత్రువు బలంగా ఉన్నప్పుడే ఎదుర్కొంటా.. బలహీనులను కాదు' అని వ్యాఖ్యానించారు.

**ఢిల్లీ పర్యటనల అసలు ఉద్దేశం**

తమ ఢిల్లీ పర్యటనల వెనుక ఉన్న ఉద్దేశాన్ని పవన్ ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్ర విభజన హామీలు, రాజధాని అమరావతి నిర్మాణం, వెనుకబడిన జిల్లాలకు నిధులు వంటి కీలక అంశాలపైనే కేంద్ర పెద్దలతో చర్చిస్తున్నామని తెలిపారు. "అమిత్ షా వంటి నాయకుల దగ్గరకు వెళ్లి జగన్ రెడ్డిని జైల్లో పెట్టమని అడిగేంత చిన్న మనస్తత్వం మాది కాదు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. మీరు కల్పిత కథలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం మానేయాలి" అని హితవు పలికారు. గీతదాటుతున్న పార్టీ నేతలకు పవన్ హెచ్చరికలు జారీ చేశారు. తనకు నచ్చినట్లుగా పార్టీని నడుపుతానని ఇష్టం లేని వాళ్లు వెళ్లిపోవచ్చన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. పదవులు వచ్చిన తర్వాత చాలా మంది జనసేన నాయకులు మెత్తబడిపోయారని, అలాంటి నాయకులు జనసేనకు అవసరం లేదని స్పష్టం చేశారు. మీ ఎదుగుదల కోసం నన్ను వాడుకోవద్దు. శత్రువులు బయట ఎక్కడో లేరు.. మన పార్టీలోనే ఉన్నారు అంటూ పార్టీ నేతలకు పవన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జనసేనలో ఉండగలిగేవాళ్లు మాత్రమే పార్టీలో ఉండండి అని స్పష్టం చేశారు. నేను టీడీపీ కోసం కాదు.. రాష్ట్రం కోసం సర్దుకుపోతున్నా అంటూ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఇకపై జనసేన కట్టుదిట్టంగా వ్యవహరిస్తుందని, వ్యక్తిగతంగా విమర్శిస్తే అదే స్థాయిలో బదులిస్తామని పవన్ కళ్యాణ్ హెచ్చరించారు.

**తమిళనాడు రాజకీయాలను చూసి జెలసీ**

జనసేనాని పవన్ కళ్యాణ్ పొరుగు రాష్ట్రం తమిళనాడు రాజకీయాలపై, అక్కడ నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే సాధించిన తాజా విజయాలపై అత్యంత ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో తనను, విజయ్‌ను పోలుస్తూ వస్తున్న కామెంట్లపై స్పందించిన ఆయన.. తమిళ పాలిటిక్స్‌ను చూస్తే తనకు కొంత అసూయ కలిగిందని మనసులో మాటను బయటపెట్టారు. "అక్కడ రాజకీయాలు ఎంత సుఖంగా సాగాయో చూశాను.. తమిళనాడులో విజయ్ అభిమానులంతా విభేదాలు లేకుండా ఏకతాటిపై నిలబడ్డారు, ఎంచక్కా కటౌట్లు పెట్టుకున్నారు, ప్రచారం చేశారు, ఒకేసారి సీఎంను చేసేశారు. కానీ ఆంధ్రాలో నా పరిస్థితి అలా కాదు. నన్ను దాదాపు 15 సంవత్సరాల పాటు రోడ్డు మీద దేకిచ్చారు అంటూ పవన్ తన సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో పడ్డ కష్టాలను, ఆవేదనను గుర్తుచేసుకున్నారు. "మనకు అనుకూలంగా మాట్లాడటానికి కనీసం సొంతంగా టీవీ ఛానళ్లు ఉన్నాయా? ఆఖరికి మనకున్న సోషల్ మీడియా హ్యాండిల్స్ అయినా నాకు ఏదైనా కష్టం వస్తే ఒకే తాటిపై, ఏకాభిప్రాయంతో నిలబడుతున్నాయా?" అంటూ పార్టీ అంతర్గత లోపాలను సున్నితంగా వేలెత్తి చూపారు. కేవలం సినిమా క్రేజ్, కటౌట్లు చూసి ఓట్లేసే సంస్కృతి కంటే ఏపీలో కుల సమీకరణాలు, పక్కా వ్యూహాలు ఎక్కువగా ప్రభావితం చేస్తాయని, అందుకే తాను ఎన్నో అవమానాలు భరించి, పొత్తుల ఫార్ములాతో నిలబడాల్సి వచ్చిందని వివరించారు.

## గోదావరి కలుషితంపై టాస్క్ ఫోర్స్

మొదటి పేజీ తరువాయి...

పర్యావరణ, అటవీ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. నదుల పట్ల మనకున్న నిర్లక్ష్యం ఇలాగే కొనసాగితే భవిష్యత్తు తరాలకు తాగు నీరు దొరకడమే చాలా కష్టమవుతుందని హెచ్చరించారు. భగవంతుడు ప్రసాదించిన నీటిని ఇష్టారాజ్యంగా కలుషితం చేస్తూ, మళ్లీ అదే తాగునీటి కోసం జలజీవన్ మిషన్ అంటూ కోట్ల రూపాయలు ఖర్చు పెట్టే విచిత్ర పరిస్థితికి స్వస్తి చెప్పాలన్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని కాలుష్యాన్ని నివారించడానికి ప్రత్యేకంగా అంతర్ జిల్లా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని అధికారులను పవన్ ఆదేశించారు. క్షేత్రస్థాయి సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలను సూచించే విధంగా ఈ టాస్క్ ఫోర్స్ పని చేయాలని సూచించారు. టాస్క్ ఫోర్స్ ఇచ్చే నివేదికలు, సూచనలు క్షేత్ర స్థాయిలో వేగంగా అమలు జరిగేలా పర్యవేక్షణ కమిటీ ఉండాలని స్పష్టం చేశారు. నదుల రక్షణకు ఇవాల్టి నుంచే యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని, వచ్చే ఆరు నెలల్లో నదుల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆదేశించారు. నది తీవ్రంగా కలుషితమవుతున్న ప్రధాన కేంద్రాలను గుర్తించి, అక్కడ తక్షణమే 'పొల్యూషన్ ఆడిట్' నిర్వహించాలని పవన్ కళ్యాణ్ అన్నారు. నదిలోకి మురుగు నీరు, రసాయనాలు చేరుతున్న కీలక ప్రాంతాల నుంచి నీటి నమూనాలను సేకరించి ల్యాబొరేటరీ పరీక్షలకు పంపాలన్నారు. నదీ తీరాలను, మన జీవ నదులను కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు మనుగడే ఉండదని హెచ్చరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మిషన్ ఫర్ క్లీన్ గోదావరి' వంటి పథకాలు కేవలం ఆర్భాటాలకే పరిమితమయ్యాయి అనిపిస్తోందని, క్షేత్రస్థాయిలో సరైన విధానం లేకపోవడం వల్లే ఆశించిన ప్రయోజనం దక్కడం లేదన్నారు. 'భక్తులు ఎంతో పవిత్ర భావంతో పుష్కర స్నానానికి వస్తారు. ఘాట్లకు వచ్చి వెళ్లాక.. మేము మురికి నీళ్లలో స్నానం చేసి వెళ్లాం అనే మాట ఎవరి నోటి వెంబడైనా వస్తే అది మన ప్రభుత్వానికే అవమానం. అందుకే మిషన్ ఫర్ క్లీన్ గోదావరి కేవలం బోర్డులకే పరిమితం కాకూడదు. గోదావరి నదుల్లోకి మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు కలవకుండా పటిష్టమైన దీర్ఘకాలిక ప్రణాళికలు అమలు చేయాలి.' అని పవన్ కళ్యాణ్ అన్నారు. గోదావరి పుష్కరాలు అంటే కేవలం రాజమండ్రే అనే భావన నుంచి బయటకు వచ్చి... గోదావరి ప్రవహిస్తున్న ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని పంచాయతీలను భాగస్వాములు చేయాలన్నారు డిప్యూటీ సీఎం. గత పుష్కరాలకు 4.6 కోట్ల మంది భక్తులు వస్తే, ఈసారి ఆ రద్దీ రెట్టింపై దాదాపు 10 కోట్ల మంది వస్తారని అంచనా ఉందన్నారు. రాజమండ్రిలోనే కాకుండా గోదావరి ప్రవహించే ఆరు జిల్లాలలో ఏడాదిపాటు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు పవన్ కళ్యాణ్. పుష్కరాల నాటికి నదీ తీరాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అన్నదే కనిపించకూడదన్నారు. గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో కాలుష్య నియంత్రణ చర్యల కోసం పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా రూ.100 కోట్ల ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తున్నామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. కాలుష్యాన్ని అరికట్టడానికి పీసీబీ ఆధ్వర్యంలో ఒక పటిష్టమైన అంతర్ శాఖల (జిల్లా) టాస్క్ ఫోర్స్ ఏర్పాటు కానుందన్నారు. ఈ ఆరు జిల్లాలకు సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉంటూ కలిసి పనిచేస్తారన్నారు. కొన్ని పరిశ్రమలకు సంబంధించిన రసాయన వ్యర్థాలు నేరుగా గోదావరి నదీపాయల్లో కలుస్తున్నాయని, దీనిపై ఈ టాస్క్ ఫోర్స్ ప్రత్యేకంగా నిఘా పెట్టి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తుందన్నారు. 'గోదావరి ప్రవహించే ఆరు జిల్లాల పరిధిలో అత్యంత ప్రాధాన్యత కలిగిన 285 గ్రామ పంచాయతీలను అధికారులు గుర్తించారు. ఈ గ్రామాల్లోని పుష్కర ఘాట్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం. ఇందుకోసం ఆయా పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వసతి కోసం గ్రామాల్లోని ఇళ్లలోనే 'హోం స్టే' సౌకర్యాలను కల్పిస్తాం. పుష్కరాల పనులు, పర్యాటకుల రాక వల్ల స్థానిక ప్రజలకు ఉపాధి దొరికి, గ్రామాలు ఆర్థికంగా ఎంతో బలోపేతం అవుతాయి.' అని పవన్ కళ్యాణ్ అన్నారు.

## రైతు రుణమాఫీ

మొదటి పేజీ తరువాయి...

అనంతరం సీఎం ఈ కీలక ప్రకటన చేశారు. ఈ నిర్ణయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సామాన్య, మధ్యతరగతి రైతు కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపింది. ప్రభుత్వ తాజా ప్రకటన ప్రకారం.. గత ఏడాది మే 1, 2025 నుండి ఫిబ్రవరి 28, 2026 మధ్య కాలంలో సహకార బ్యాంకుల నుండి పంట రుణాలు తీసుకున్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 14,22,555 మంది రైతులు ఈ రుణమాఫీ వల్ల రుణ విముక్తులు కానున్నారు. దీనికోసం తమిళనాడు ప్రభుత్వంపై రూ. 2,044.46 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనుంది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, రైతుల ప్రయోజనాలే ముఖ్యమని సీఎం విజయ్ ఈ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకంలో చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. రూ. 50,000 లోపు రుణం ఉన్న అల్ప ఆదాయ రైతులకు వంద శాతం రుణమాఫీని ప్రకటించింది. అంటే వారి అప్పు మొత్తం పూర్తిగా రద్దు కానుంది. ఇతర రైతులకు కూడా అదే స్థాయిలో 50 శాతం వరకు రుణమాఫీ వర్తించనుంది. రుణ మొత్తం పెరిగే కొద్దీ ప్రభుత్వం ఒక నిర్దేశిత మొత్తాన్ని మాఫీ చేస్తూ పట్టికను విడుదల చేసింది. గరిష్టంగా లక్ష రూపాయలకు పైగా రుణం ఉన్నవారికి కూడా రూ. 5,000 వరకు రాయితీ కల్పించారు. పంట రుణాల మాఫీ ద్వారా రైతులకు కొత్తగా రుణాలు పొందే అవకాశం కలుగుతుందని, ఇది రాబోయే సాగు సీజన్‌కు ఎంతో మేలు చేస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కేవలం అప్పులు రద్దు చేయడమే కాకుండా, వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఆర్బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా, రాబోయే 45 నుండి 60 రోజుల్లోనే ఈ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని అధికారులకు సీఎం స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సీఎం విజయ్ తీసుకున్న ఈ నిర్ణయంపై తమిళనాడు రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేద రైతులకు ఈ పథకం ఒక వరమని అభిప్రాయపడుతున్నారు. రాజకీయాల్లోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే రైతుల పక్షపాతిగా విజయ్ గుర్తింపు పొందాలని చూస్తున్నట్లు ఈ పథకం ద్వారా స్పష్టమవుతోంది. ఈ నిర్ణయం రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయాల్లో టీవీకే పార్టీకి మరింత మైలేజీని ఇస్తుందని భావిస్తున్నారు.

## విలేజ్ టు గ్లోబర్ మార్కెట్

మొదటి పేజీ తరువాయి...

చంద్రబాబు తెలిపారు. ప్రతీ నియోజకవర్గంలో ఒక ఏంఎస్ఎంఈ పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇవాళ శంకుస్థాపన చేసిన 38 పార్కులతో పాటు వంద పార్కులకు ఇప్పటికే శంకుస్థాపన చేశామన్నారు. ఎలాంటి వివాదాలు లేకుండా ఈ పారిశ్రామిక పార్కులకు భూములు ఇచ్చిన రైతులకు చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ప్రైవేటు పారిశ్రామిక పార్కులకు కూడా ఇన్సెంటివ్స్ ఇస్తామన్నారు. శ్రీసిటీ విజయవంతమైన పారిశ్రామిక పార్క్ అని అన్నారు. 28 వేల కోట్ల కార్పస్ ఫండ్ డ్వాక్రా మహిళల సంఘాల వద్ద ఉందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది 5 లక్షల మంది డ్వాక్రా సంఘాల మహిళలను ఎంటర్ ప్రెన్యూర్లుగా మారుస్తామన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తామన్నారు. ఏపీ నుంచి వంద యునికార్న్ సంస్థలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వచ్చేది నాలెడ్జ్ ఎకానమీ దీనిని అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. విలేజ్ టు గ్లోబల్ మార్కెట్ అనేది తమ ప్రభుత్వ నినాదమన్నారు. ఒక పరిశ్రమ వ్యర్థాలు మరో పరిశ్రమకు ముడి సరుకుగా మారుతుందన్నారు. సర్క్యులర్ ఎకానమీ వ్యవస్థ, ఎంఎస్ఎంఈ ఎకో సిస్టమ్ తయారు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. అంతకుముందు విజయవాడ ఎంఎస్ ఎంఈ గ్రోత్ సమ్మిట్ 2026లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు సందర్శించారు. ఆర్ టీ ఐ హెచ్ లోని వివిధ స్టార్టప్ సంస్థలు రూపొందించిన టెక్నాలజీ ఎనేబుల్డ్ హ్యాండ్, వీరపనేనిగూడెంలో డిఫెన్స్ ఉత్పత్తుల, మచిలీపట్నంలోని బీహెచ్ఈఎల్ తయారు చేసిన ఎలక్ట్రికల్ ఉత్పత్తులను సీఎం తిలకించారు. డ్రోన్ బోట్స్ సహా గిరిజనులు సాగు చేస్తోన్న కొండ చీపురు గడ్డి ఉత్పత్తులను ఆయన పరిశీలించారు.




## మళ్లీ.. మళ్లీ.. బాదుడు

మొదటి పేజీ తరువాయి...

'హార్ముజ్ జలసంధి' లో ఏర్పడిన ఆటంకాలే ముఖ్య కారణం. ప్రపంచ సరఫరాలో 1/5 వంతు: ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురు, ద్రవీకృత సహజ వాయువులో దాదాపు ఐదో వంతు ఇరాన్–ఒమన్ మధ్య ఉండే ఈ ఇరుకైన జలసంధి గుండానే ప్రయాణిస్తుంది. భారతదేశం తన ముడి చమురు అవసరాలలో 85% కంటే ఎక్కువ దిగుమతులపైనే ఆధారపడుతుంది. అమెరికా–ఇరాన్ ఘర్షణల కారణంగా ఈ మార్గంలో వాణిజ్య నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో మార్కెట్‌లో చమురు కొరత ఏర్పడుతుందనే భయాలు మొదలయ్యాయి. ఇది అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడ్ ధరలను భారీగా పెంచేసింది.

**ఇంకా పెరిగే అవకాశం ?**

పరిశ్రమ నిపుణులు, రాయిటర్స్ విశ్లేషకుల ప్రకారం, చమురు ధరల పెంపు ఇక్కడితో ఆగేలా లేదు. ఐదోసారి కూడా ధరలు పెరిగే అవకాశం ఉందని వారు అంచనా వేస్తున్నారు. కంపెనీల నష్టాలు: యుద్ధం ప్రారంభ దశలో, దేశంలో అసెంబ్లీ ఎన్నికల సీజన్ ఉన్న సమయంలో అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 72.87 డాలర్ల నుంచి ఏకంగా 120 డాలర్లకు చేరింది. ఆ సమయంలో కంపెనీలు ధరలను స్థిరంగా ఉంచడం వల్ల భారీగా నష్టపోయాయి. ఇప్పుడు ఆ పాత నష్టాలను పూడ్చుకోవడానికి కంపెనీలు ప్రయత్నిస్తున్నాయి. చమురు కంపెనీల రోజువారీ నష్టాలు గతంలో రూ. 1,000 కోట్లుగా ఉండగా, తాజా పెంపుల తర్వాత అవి తగ్గినప్పటికీ పూర్తిగా తొలగిపోలేదు. బ్రెంట్ క్రూడ్ ధర 100 డాలర్ల లోపు స్థిరపడితే తప్ప భారత్‌లో ధరలు తగ్గే అవకాశం లేదు. ఇంధన ధరల సవరణ అనివార్యమని కేంద్ర ప్రభుత్వం ఇదివరకే సూచనప్రాయంగా తెలిపింది. అంతర్జాతీయ సరఫరా గొలుసు దెబ్బతిన్న తరుణంలో ఏదో ఒక దశలో ప్రభుత్వం చమురు ధరలపై కఠిన నిర్ణయం తీసుకోక తప్పదని పేర్కొన్నారు.

**లాభాల్లో ఉన్న కంపెనీలు ధరలు ధరల పెంపు**

ప్రభుత్వ రంగ చమురు సంస్థలైన ఇండియన్ ఆయిల్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్)లు గడిచిన 2025–26 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ. 77,000 కోట్ల భారీ నికర లాభాలను ఆర్జించాయి. ఇంత లాభాల్లో ఉండి కూడా మళ్లీ ప్రజలపై భారం వేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, పశ్చిమ ఆసియా సంక్షోభం వల్ల పెరిగిన రవాణా, భీమా ఖర్చులను ప్రస్తుత రిటైల్ ధరలు పూర్తిగా కవర్ చేయడం లేదని కంపెనీల ఎగ్జిక్యూటివ్‌లు సమర్థించుకుంటున్నారు. అమెరికా– ఇరాన్ మధ్య శాంతి చర్చల పురోగతిపై ఆదివారం నుంచి వార్తలు వెలువడుతున్నాయి. ఇది ప్రపంచ దేశాలకు ఊరటనిచ్చే విషయం. ఈ వార్తలతోనే చమురు ధర భారీగా పతనమైంది. బ్రెంట్ క్రూడ్ సోమవారం ట్రేడింగ్‌లో దాదాపు 5.2శాతం పడి బ్యారెల్‌కి రూ. 98 డాలర్ల దిగువకు చేరింది. ఈ చర్చలు సఫలమైతేనే అంతర్జాతీయంగా చమురు మార్కెట్ శాంతించే అవకాశం ఉంది.



## మా సంస్థకే ఈడీ నోటీసులు

(అమరావతి - జయజయహే)

మద్యం కుంభకోణానికి సంబంధించి తన భార్యకు ఈడీ నోటీసులు జారీ చేసిందంటూ తప్పుడు ప్రచారం చేయడం తగదని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. ఆ నోటీసు కంపెనీకి జారీ అయిందే తప్ప తన భార్యకు ఎటువంటి నోటీసులూ అందలేదని ఆయన స్పష్టం చేశారు. విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ 'ఇషాన్వి' 'కేశినేని డెవలపర్స్' సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఒక రియల్ ఎస్టేట్ సంస్థకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నుంచి నోటీసు అందిందని తెలిపారు. ఆ సంస్థకు అందిన నోటీసుపై వివరణను ఈ నెల 27వ తేదీన సమర్పిస్తామని ఆయన ప్రకటించారు. తమకు సంబంధించిన భూములు ఒకదానికొకటి ఆనుకుని ఉండటం వల్ల, రాజ్ కేసీ రెడ్డికి సంబంధించిన సంస్థ అయిన 'ఇషాన్వి'తో కలిసి ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టును చేపట్టే ఉద్దేశంతో 2021లో 'ఫ్రైడ్ ఇన్‌ఫ్రా' అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. సంస్థకు సంబంధించి ఈడీకి పూర్తి సమాచారం : ఈ సంస్థ ద్వారా రూ.35 లక్షల విలువైన లావాదేవీలు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. రాజ్ కేసీ రెడ్డి నేపథ్యం గురించి తెలియగానే 2022లోనే తాము ఆ సంస్థ నుంచి వైదొలిగినట్లు కేశినేని శివనాథ్ వెల్లడించారు. కేవలం ఈ ఒక్క లావాదేవీకి సంబంధించి వివరణ కోరుతూనే ఈడీ నోటీసు జారీ చేసిందని ఆయన తెలిపారు. ఆర్కిటెక్చరల్ ఫీజుల నిమిత్తం జరిగిన రూ.35 లక్షల లావాదేవీ తప్ప, ఆ సంస్థ ద్వారా మరే ఇతర కార్యకలాపాలు జరగలేదని తాము ఈడీకి ఇచ్చే సమాధానంలో స్పష్టం చేస్తామని ఆయన జోడించారు. మద్యం కుంభకోణానికి సంబంధించి తన భార్యకు నోటీసులు వచ్చాయంటూ వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆయన స్పష్టం చేశారు. ఆ సమయంలో ఏర్పాటు చేసిన ఆ సంస్థలో తన భార్య కేవలం ఒక డైరెక్టర్‌గా మాత్రమే వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు. ఆ సంస్థకు మాత్రమే నోటీసు అందిందే తప్ప, తన భార్యకు మాత్రం ఎటువంటి నోటీసులూ అందలేదని కేశినేని శివనాథ్ నిస్సందేహంగా తేల్చి చెప్పారు.

## సీబీఐ విచారణ చేయాలి

మొదటి పేజీ తరువాయి...

ఆయన ప్రశ్నించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఈ పరీక్షల నిర్వహణలో డార్క్ ఆపరేషన్ సాగిందని జగన్ ఆరోపించారు. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో కీలక పాత్ర పోషించిన ఎస్సీఈఆర్టీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగికి మొదటి ర్యాంకు రావడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ అనుమానాస్పద టాపర్ వివరాలను డేటాబేస్ నుండి తర్వాతి కాలంలో డిలీట్ చేయడం వెనుక అసలు మతలబు ఏమిటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. మెరిట్ లిస్టులను బహిరంగంగా ఉంచకుండా దాచిపెట్టడం వెనుక భారీ కుట్ర దాగి ఉందని విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా ఏ ప్రభుత్వ నియామక ప్రక్రియలోనైనా ఎంపికైన వారి జాబితాలను కలెక్టరేట్‌లలో లేదా అధికారిక వెబ్‌సైట్‌లలో ఉంచడం ఆనవాయితీ. కానీ, ఈసారి కేవలం ఎంపికైన వారికి మాత్రమే నేరుగా మెసేజ్‌లు పంపడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. పబ్లిక్ డొమైన్‌లో జాబితా పెట్టకపోవడం ద్వారా అర్హులైన ప్రతిభావంతులకు అన్యాయం జరిగిందని, వెనుకదారిలో తమకు కావాల్సిన వారికి ఉద్యోగాలను కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. మరోవైపు స్పోర్ట్స్ కోటా పోస్టుల విషయంలో భారీ బేరసారాలు సాగాయని జగన్ ఆరోపించారు. ఒక్కో పోస్టుకు 15 లక్షల రూపాయల వరకు డీల్ కుదిర్చారని, క్రీడా మైదానంలో అడుగు పెట్టని వారికి కూడా అధికార పార్టీ నాయకుల అండదండలతో ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చి ఎంపిక చేశారని అంటున్నారు. రిక్రూట్‌మెంట్‌ను కాస్తా వేలం పాటలా మార్చేశారని, ప్రతిభ ఉన్న అభ్యర్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారన్నారు. పరీక్షా కన్వీనర్ల మార్పు విషయంలోనూ ప్రభుత్వం అనుమానాస్పదంగా వ్యవహరించిందని, నిబంధనలకు విరుద్ధంగా జాయింట్ డైరెక్టర్‌ను కన్వీనర్‌గా తీసుకురావడం వెనుక అవినీతి కోణం ఉందని జగన్ ఆరోపించారు. ఈ మొత్తం వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ నారా లోకేష్‌ను పదవి నుంచి తప్పించాలని, వెంటనే సీబీఐ దర్యాప్తు కోరాలన్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తిస్థాయి విచారణ జరిపితేనే అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని జగన్ అన్నారు.

## డ్వాక్రాలకు రూ. 10 లక్షల రుణం

మొదటి పేజీ తరువాయి...

చేయనున్నట్లు స్పష్టం చేశారు. కేంద్రం తీసుకొచ్చి ఐఈఎల్‌ఏ విధానం ద్వారా ఈ రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్వాక్రా మహిళలు కొత్తగా ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటు చేయాలనుకుంటే ఈ రుణం తీసుకొవచ్చని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్, వ్యవసాయ అనుబంధమైన యూనిట్ల కోసం లోన్ ఇస్తారన్నారు. పుట్టగొడుగుల ఉత్పత్తి, తేనె, మునగ, నర్సరీలు, సోలార్ డ్రయ్యర్లు, చేపలు, రక్షిత సాగు వంటి ప్రాసెసింగ్ యూనిట్లకు ఈ రుణం ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. అర్హులైన డ్వాక్రా మహిళలందరూ ఈ రుణం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీపీఆర్ తయారీ, దరఖాస్తు విధానంలో సెర్ప్ శాఖలోని వెలుగు విభాగం అధికారులు సహాయసహకారాలు అందిస్తారని అన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ రుణాలు తోడ్పాటు అందిస్తాయని స్పష్టం చేశారు. ఇక రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించేందుకు ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. ఏపీ ఎస్ఎంఈలు ఎక్స్ఛేంజ్ ఏర్పాటు అవకాశాలు పరిశీలించేందుకు ఈ కమిటీ ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. చిన్న, మధ్యతరగతి కంపెనీల ఐపీవోలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఈ నిర్ణయం తీసుకుంది. ఎంఎస్ఎంఈలకు ఈక్విటీ, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ప్రభుత్వం నిధులు సమకూర్చనుంది. కాగా డ్వాక్రా మహిళల కోసం ఏపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. అందులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది. ఇక కేంద్రంతో సంబంధం లేకుండా ప్రభుత్వం ప్రత్యకంగా రుణాలు మంజూరు చేస్తోంది. డ్వాక్రా సంఘాల మహిళలు తమ కుటుంబంలోని పిల్లల విద్య, పెళ్లి అవసరాల కోసం ప్రభుత్వం రుణాలు విడుదల చేస్తోంది.

# రూ.16 వేలకే ఏఎన్ఎం పదోన్నతి...!

- బేరం రూ. 30 వేలు...అడ్వాన్స్ అందిన తర్వాతే ఆర్డర్స్
- ఉమ్మడి విశాఖ డీఎం అండ్ హెచ్ఓ లో జరిగిన దందా
- గుట్టు చప్పుడు కాకుండా చీకటి పడ్డాక ఉత్తర్వులు జారీ

**విశాఖపట్నం, మే 25, జయ జయహే :**

ఉమ్మడి విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవినీతి మర్రిఊడల కన్నా బలంగా నాటుకుపోయింది. అందుకే డబ్బులు అడ్వాన్స్ రూపంలో పడితే గానీ ఫైల్ ఏ మాత్రం కదలని పరిస్థితి. అందుకే రూ. 16 వేలు చొప్పున అడ్వాన్స్ తీసుకున్నాకే పదోన్నతి ఉత్తర్వులు చక చకా చేతిలో పెట్టేశారు. ఈ దందాకు సంబంధించి వివరాల్లోకెళితే ఉమ్మడి విశాఖ జిల్లాలో 1300 మంది గ్రామ వార్డు సచివాలయం ఏఎన్ఎంలుగా పని చేస్తున్నారు. వీరిలో సీనియర్లకు గ్రేడ్ 3 ఏఎనఎంలుగా పదోన్నతి గతంలో ఇచ్చారు. మెరిట్ ర్యాంక్ ఆధారంగా 263 మందికి గ్రేడ్ 3 పదోన్నతులకు అర్హులుగా ఉమ్మడి జిల్లా జాబితా తయారు చేశారు. అయితే వీరిలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ కోర్సు చదివిన కొందరు అప్రెంటిస్ చేయకుండా నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాల్లో చేరారని, వారికి ఎలా పదోన్నతులు ఇస్తారని కొంతమంది రెగ్యులర్గా చదివిన ఏఎనఎంలు అప్పట్లో కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయగా 263 అభ్యర్థుల్లో




దాదాపు 30 మందికి నకిలీ సర్టిఫికెట్లు అని తేలింది. అలా తేలిన వారిని పక్కన పెట్టేసి మిగతా వారికి అప్పట్లో పదోన్నతి ఇచ్చారు. వాస్తవానికి ఆ 30 మందిని నకిలీ సర్టిఫికెట్లు కారణంగా ఉద్యోగం నుంచి తీసేయాలా...కొనసాగించాలా అన్న క్లారిటీ ఉన్నతాధికారుల నుంచి తీసుకోవాలి. కానీ లక్షల్లో లంచాలు మరిగిన ఇక్కడి అధికారులు ఇదే అదనుగా చేసుకుని వారి నుంచి బంగారు ఆవులా తలో కొంచెం పిండుకుంటున్నారు. పైగా అప్రెంటిస్ ఒక్కటే చేయలేదు కానీ...కోర్సు అయితే పూర్తి చేశారుగా అంటూ వెనకేసుకొచ్చి వారి నుంచి అందినంతా దోచుకుంటున్నారు. నకిలీ ఎప్పటికైనా నకిలీనే అన్నది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా వారి నుంచి భారీ నజరానాలు అందుకుంటూ...యనియన్ నేతలతో చేతులు కలిపి మరీ దందాను కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే తాజాగా సోమవారం మిగిలిన ఓ 16 మందికి పదోన్నతులు కల్పిస్తూ డీఎం అండ్ హెచఓ డాక్టర్ జగదీశ్వరరావు ఉత్తర్వులు జారీ చేశారు. గత డిసెంబర్ మాసంలోనే 263 మందిలో పొజిషన్ ఐడీ లేదంటూ 16 మందిని పక్కన పెట్టారు. ఇప్పుడు ఆ 16 మందికీ ఒక్కొక్కరి నుంచి రూ. 30 వేలు అడిగి ఆఖరికి రూ. 16 వేలు చొప్పున అడ్వాన్స్ అందుకున్న తర్వాతే పదోన్నతులు ఇచ్చినట్టు కార్యాలయ వర్గాలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. మిగిలిన బ్యాలెన్స్ ఇస్తారో లేదో తెలీదు కనుక...చచ్చినోడి పెళ్లికి వచ్చిందే కట్నమన్నట్టుగా ఆ మొత్తాన్ని సర్దుకుంటున్నారన్న గుస గుసలు వినిపిస్తున్నాయి. నిఖార్సైన అధికారులైతే దొంగ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందిన వారిని ఉన్నతాధికారుల నోటీసులో పెట్టి ఉద్యోగాల నుంచి తొలగించాలి. క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలి. కానీ లంచాల రుచి మరిగిన ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం తమ చేతికి మట్టి అంటకుండా అంతా కలెక్టర్పై నెట్టేసి నోట్ల కట్టలను మాత్రం జేబుల్లో పెట్టుకుని పోతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## విజ్జేశ్వరంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటన

**విజ్జేశ్వరం,సిద్ధాంతం ఏటిగట్టు అభివృద్ధికి చర్యలు**

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం నిడదవోలు నియోజకవర్గంలోని విజ్జేశ్వరం ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి మేరకు రాబోయే 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో మౌలిక వసతుల అభివృద్ధిపై ఆయన ప్రత్యేకంగా పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా విజ్జేశ్వరం నుండి సిద్ధాంతం వరకు 'వశిష్ట రైట్ ఫ్లడ్ బ్యాంక్ కెనాల్' పై బీటీ రోడ్డు (ఏటిగట్టు) నిర్మాణ ప్రతిపాదనను మంత్రి దుర్గేష్ డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సుమారు రూ.66 కోట్ల వ్యయంతో 33 కిలోమీటర్ల మేర ఈ రహదారిని అభివృద్ధి చేస్తే గోదావరి పుష్కరాల సమయంలో భక్తుల రద్దీ నియంత్రణతో పాటు స్థానిక ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని వివరించారు. మంత్రి ప్రతిపాదనపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్థానిక గోదావరి బండ్ ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. గోదావరి బండ్ను పర్యాటక, రవాణా పరంగా అభివృద్ధి చేస్తే ఉభయ గోదావరి జిల్లాల అనుసంధానానికి మేలు జరుగుతుందని మంత్రి దుర్గేష్ వివరించగా, దీనిపై పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించారు. పూర్తి స్థాయి నివేదికలు పరిశీలించిన అనంతరం అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే పెండ్యాల, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాల వద్ద ఏటిగట్టు పటిష్టీకరణకు సంబంధించిన నివేదికలను వెంటనే సమర్పించాలని ఇరిగేషన్ అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, "గోదావరి పుష్కరాల సమయంలో కోట్లాది మంది భక్తుల రాకపోకలను సులభతరం చేయడానికి ఈ ఏటిగట్టు రహదారి కీలకం. ఈ రహదారి అభివృద్ధి ద్వారా నిడదవోలు రూరల్, పెరవలి మండలాల రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడుతుంది. అలాగే ఈ ప్రాంతం పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందుతుంది" అని తెలిపారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## రోడ్డు పునర్నిర్మాణానికి వినతి

**వంపూరి గంగులయ్య కి వినతి పత్రం...**

**కొయ్యూరు : (జయ జయహే )మే 26**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల జనసేన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో భాగంగా ఆడాకుల పంచాయతీ గ్రామ ప్రజలు మరియు కొయ్యూరు మండల జనసేన పార్టీ గౌరవ అధ్యక్షుడు సాగిన బుజ్జి బాబు ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమీ చైర్మన్, అరకు-పాడేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి వంపూరి గంగులయ్య కి వినతి పత్రం అందజేశారు. కిట్టారం గ్రామం నుండి ఆడాకుల మీదుగా చమ్మాచింత గ్రామం ఆంజనేయ స్వామి గుడి వరకు గల 6.5 కిలోమీటర్ల తారు రోడ్డు 2012 సంవత్సరంలో నిర్మించబడి, ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ రహదారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజవొమ్మంగి హైవే రోడ్డు నుండి ఉమ్మడి విశాఖ జిల్లా నాతవరం మండల కేంద్రానికి వెళ్లే అతి ముఖ్యమైన మార్గం. నిత్యం వేల సంఖ్యలో ప్రజలు, విద్యార్థులు, అనారోగ్యంతో ఉన్నవారు, ద్విచక్ర వాహన ప్రయాణికులు ఈ రోడ్డునే వినియోగిస్తున్నారు. శిథిలమైన 6.5 కి.మీ. రోడ్డును పునర్నిర్మించాలని, అలాగే చమ్మాచింత వద్ద పిడబ్లాడి కాలువపై వంతెన నిర్మించి బస్ సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి పత్రానికి సానుకూలంగా స్పందించిన గంగులయ్య , త్వరలో ఆడాకుల, కిట్టారం, బాలారం, నెల్లిపూడి, బాకులూరు మొదలగు గ్రామాల మండల పర్యటన సందర్భంగా ఈ సమస్యను స్వయంగా పరిశీలిస్తానని, అనంతరం జిల్లా కలెక్టర్ తో ఈ విషయంపై చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, గౌరవాధ్యక్షుడు సాగిన బుజ్జి బాబు, మహిళా మండల అధ్యక్షురాలు సెగ్గె సాయి భావన జయంతి, ప్రధాన కార్యదర్శి గూడెపు శేషుబాబు, ఆడాకుల పంచాయతీ జనసేన పార్టీ కార్యదర్శి ఆకుల రాజు బాబు, పంచాయతీ ఉపాధ్యక్షుడు లంక లోవరాజు తదితరులు పాల్గొని వినతి పత్రం అందజేశారు



## పోలకల్లో ధార్మిక కార్యక్రమాలు ప్రారంభం

**సి. బెళగల్ (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సి. బెళగల్ మండలం, పోలకల్ గ్రామంలోని శ్రీకృష్ణ మందిరం నందు మంగళవారం నుండి శుక్రవారం వరకు ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబందించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే ఆవిష్కరింప చేశారు. మంగళవారం నుండి గురువారం వరకు సాయంత్రం 6-00 గం. నుండి మూడు రోజులపాటు కర్నూలు నగరానికి చెందిన ఈ. ఆర్. కె. వి. ప్రసాదరావుచే శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ప్రవచనాలు, స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం సాయంత్రం 4.00 గం. నుండి గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకృష్ణ మందిరం అర్చకులు ఆవుల తిక్కన్న, జి. సోమప్ప, వై. వేంకటేశ్వర్లు, వై. శోభన్ బాబు, వై. శేఖర్, ఎ. దస్తగిరి, వై. గోపాల్, తపాల వెంకటేశ్, జె. సుంకన్న, డి. పరసురాముడు, డి. మల్లేశ్, బి. శ్రీనివాసులు, ఎ. చిన్నబసన్న, ఎ. పెద్దబసన్న తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలు దేశం మొత్తం మాట్లాడుకునేలా నిర్వహించాలి

**ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



రానున్న గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా చర్చించుకునే స్థాయిలో అత్యంత వైభవంగా, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను,ప్రతినిధులను కోరారు. పుష్కరాల ఏర్పాట్లలో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతుల అభివృద్ధికి పరిశ్రమల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా స్థానిక ఆర్ఎంసీ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పరిశ్రమల ప్రతినిధులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రానున్న ఏడాది కాలంలో గోదావరి పుష్కరాల పనులను అత్యంత సమర్థవంతంగా పూర్తి చేయాలని, ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పుష్కరాల నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించిన పవన్ కళ్యాణ్, గ్రామ పంచాయతీలు మౌలిక సదుపాయాల కోసం కోరే నిధులను పరిశ్రమలు సీఎస్ఆర్ కింద అందించాలని కోరారు. ఈ నిధులను పుష్కర ఘాట్ల అభివృద్ధి, పరిశుభ్రత, పచ్చదనం, కాలుష్య నియంత్రణ చర్యలకు వినియోగించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు పరిశ్రమలు చైతన్యపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. "పరిశ్రమల కష్టనష్టాలు నాకు తెలుసు. పరిశ్రమల సమస్యలపై నాకు అవగాహన ఉంది. మీకు ప్రభుత్వం వెన్నంటి ఉ ంటుంది" అని పరిశ్రమల ప్రతినిధులకు ఉప ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. అదే సమయంలో ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కాలుష్య నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని హెచ్చరించారు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో కాలుష్య స్థాయులు పెరుగుతున్నట్లు తెలిసిందని, ప్రజల ఆరోగ్యానికి భంగం కలగకుండా పరిశ్రమలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పరిశ్రమల ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కళ్యాణ్ తెలిపారు. పరిశ్రమల యాజమాన్యాలు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాల వారీగా అవసరాలను గుర్తించి పరిశ్రమల సహకారాన్ని తీసుకుంటామని వెల్లడించారు. పరిశ్రమల ప్రతినిధులు కూడా ఉప ముఖ్యమంత్రి పిలుపుకు సానుకూలంగా స్పందించారు. తాము కాలుష్య నియంత్రణ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తున్నామని, సంబంధిత ధృవపత్రాలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు సమర్పిస్తామని తెలిపారు. ఇప్పటికే సీఎస్ఆర్ కార్యక్రమాల ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గోదావరి పుష్కరాల పనుల్లో జిల్లా యంత్రాంగంతో కలిసి పనిచేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



## రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి నిదర్శనం ఎంఎస్ఎం ఈ పార్కులు

**రాష్ట్రంలో 23 నెలల్లో రూ 23 లక్షల కోట్లు పెట్టుబడులు**

**ఇంటికో పారిశ్రామికవేత్త కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చన్న వెల్లడి**

**టెక్కలి మే 25 జయ జయహే**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ప్రగతి పథశీ లో నడిపించి అభివృద్ధి సాధించేందుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల నుంచి అభివృద్ధి కొనసాగుతుందనీ రాష్ట్ర వ్యవసాయ, సహకార, పశువర్ధక ,పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చం నాయుడు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం చీపుర్లపాడు గ్రామం వద్ద రూ 10.51 కోట్ల రూపాయలతో ఎం ఎస్ ఎం ఈ సూక్ష్మ చిన్న మరియు మధ్య తరహా సంస్థల అభివృద్ధి, పార్కును నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల ప్రాంతాల ను అభివృద్ధి దిశగా మార్చేందుకు రూ 10,50 కోట్ల వ్యయంతో 12,22 ఎకరాల విస్తీర్ణంలో 74 ప్లాట్లు తో ఈ ప్రాంతాభివృద్ధికి శ్రీకారం చుడుతున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటే అంతర్జాతీయంగా ఓ బ్రాండ్ ఏర్పడిందని ఆయన సారధ్యంలో ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ఈ ప్రభుత్వ లక్ష్యమని ఇది అందరి నమ్మకమని అచ్చన్న అన్నారు. గతంలో వైయస్సార్సీపి జగన్ హయాంలో వినాశకర అభివృద్ధి జరిగిందని ఇది అందరికీ తెలుసునని ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి చోటు లేదని మంత్రి కింజరాపు అచ్చం నాయుడు విమర్శించారు. పారిశ్రామిక అభివృద్ధిలో ఎం ఎస్ ఎం ఈ పార్కుల నిర్మితం వల్ల యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి కింజరాపు అచ్చం నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, టెక్కలి ఆర్డీవో ఎం కృష్ణమూర్తి, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## తాళాలు బయట దాచిన ఇళ్లనే టార్గెట్ చేసిన దొంగ అరెస్ట్

**రూ.30 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం**

**మధురవాడ,జయ జయహే**



ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లే సమయంలో తాళాలు పూల కుండీలు, చెప్పుల స్టాండ్లు, స్విచ్ బోర్డుల వద్ద దాచే అలవాటును ఆసరాగా చేసుకుని వరుస దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్థుడిని క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.30 లక్షల విలువైన 230 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు, డీసీపీ (క్రైమ్స్) కె. లతా మాధురి, ఏసిపి జి. భవ్య రెడ్డి పర్యవేక్షణలో క్రైమ్ విభాగం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం పి.కె. పాలవలస గ్రామానికి చెందిన పూన్నాన రాంబాబు అలియాస్ నిహాన్ (31)పై గతంలోనే 40కి పైగా దొంగతనం కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మూడేళ్ల జైలు శిక్ష అనుభవించి వచ్చినప్పటికీ తిరిగి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వెల్లడించారు. గత నెలలో ఆనందపురం పోలీస్ స్టేషన్ నుంచి తప్పించుకుని పారిపోయిన నిందితుడు కూడా ఇతనే అని పోలీసులు పేర్కొన్నారు. ఉదయం సమయంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లిన తర్వాత, తాళం బయట దాచే ఇళ్లను ముందుగా గుర్తించి, అదే తాళాలతో ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడేవాడని విచారణలో తేలింది. ఆనందపురం, భోగాపురం, పద్మనాభం పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు ఇళ్లలో భారీగా బంగారం దోచుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. నార్త్ సబ్ డివిజన్ పీఎం పాలెం క్రైమ్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో క్రైమ్ ఏసీపీ జి. భవ్య రెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. క్రైమ్ ఇన్స్పెక్టర్ బి.ఎస్.ఎస్. ప్రకాశ్ ఆధ్వర్యంలో ఆనందపురం డీఎస్ఐ ఎస్.కె. షరీఫ్, ఎస్ఐ ఎస్. సూర్యప్రకాష్ బృందం నిందితుడిని చాకచక్యంగా అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించింది. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు తాళం చెవులను ఇతరులకు కనిపించే ప్రదేశాల్లో దాచవద్దని, అలా చేయడం దొంగలకు సులభంగా అవకాశం కల్పించినట్లవుతుందని ఏసీపీ భవ్య రెడ్డి ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు.




## ప్రైవేట్ పాఠశాలలు వద్దు... ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

**టిడిపి మండల అధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య**

**జయ జయహే - ప్రత్యేక ప్రతినిధి :**

వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం లక్ష్యంగా ప్రైవేట్ పాఠశాలలు వద్దు. ప్రభుత్వ పాఠశాలలు ముద్దు అంటూ ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని టిడిపి మండల అధ్యక్షుడు పాడి. వెంకటసుబ్బయ్య యాదవ్ సోమవారం ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓజిలి మండల టిడిపి అధ్యక్షుడు పాడి. వెంకటసుబ్బయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన బోధనతో పాటు అనుభవజ్ఞులు, నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు , యూనిఫాంలను రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం , వారంలో మూడురోజులు గుడ్లు, రాగిజావా అందిస్తున్నారని గుర్తు చేశారు. ప్రతీ నెల పేరెంట్స్, టీచర్స్ మీటింగ్తో విద్యార్థుల చదువుపై చర్చించే అవకాశం సైతం కల్పించారని వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎన్.ఎస్.ఆర్ గిరిజన కాలనీలో ఉన్న ప్రతి పిల్లవాడిని ప్రభుత్వ పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు తీర్మానించడం జరిగిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శైలజ, హెచ్ఎం హిమబిందు, విద్యార్థుల తల్లిదండ్రులు , తదితరులు పాల్గొన్నారు.



## కాలుష్య నియంత్రణకు
# హరిత రవాణా మార్గం

(సి.హెచ్.ప్రతాప్)

ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం, ఇంధన వినియోగం, వాతావరణ మార్పులు దేశాలను హరిత రవాణా వైపు నడిపిస్తున్నాయి. ముఖ్యంగా రవాణా రంగం కార్బన్ ఉద్గారాలకు ప్రధాన కారణంగా మారుతోంది. అంతర్జాతీయ అధ్యయనాల ప్రకారం ప్రపంచ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో రవాణా రంగం వాటా సుమారు 15 శాతం వరకు ఉంది. ఈ నేపథ్యంలో విద్యుత్ వాహనాలు, ప్రజారవాణా, హైడ్రోజన్ ఇంధనం, బయోఇంధనాల వినియోగం వంటి హరిత చలన విధానాలు అత్యవసరంగా మారాయి.

ప్రపంచవ్యాప్తంగా 2024లో సుమారు 1.7 కోట్ల విద్యుత్ వాహనాల విక్రయాలు నమోదయ్యాయి. 2025 నాటికి ఈ సంఖ్య 2 కోట్లకు చేరే అవకాశం ఉందని అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచనా వేస్తోంది. చైనా, యూరప్, అమెరికా దేశాలు వేగంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచుతున్నాయి. అనేక దేశాలు 2030 తర్వాత పెట్రోల్, డీజిల్ వాహనాల విక్రయాలను క్రమంగా నిలిపివేయాలని లక్ష్యాలు నిర్దేశించుకున్నాయి.

భారత్‌లో కూడా హరిత రవాణా వైపు గణనీయమైన మార్పులు కనిపిస్తున్నాయి. 2025 ఫిబ్రవరి నాటికి దేశంలో 56 లక్షలకు పైగా విద్యుత్ వాహనాలు నమోదయ్యాయి. 2024లో విద్యుత్ వాహనాల అమ్మకాలు 19 లక్షల యూనిట్లకు చేరి మొత్తం వాహన విక్రయాలలో 7.5 శాతం వాటాను సాధించాయి. ముఖ్యంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల విభాగంలో భారత్ ప్రపంచంలో ముందంజలో ఉంది. విద్యుత్ బస్సుల వినియోగంలో కూడా భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచింది.

భారత్ ప్రభుత్వం 2030 నాటికి భారీ స్థాయిలో విద్యుత్ వాహనాల వినియోగాన్ని పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం 2030 నాటికి దేశ రహదారులపై 8 కోట్ల విద్యుత్ వాహనాలు ఉండాలని, వాహన వినియోగంలో 70 శాతం వరకు విద్యుత్ ఆధారిత రవాణా పెరగాలని లక్ష్యాలు రూపొందించబడ్డాయి. దీనికోసం ఫేమ్, పీఎం ఈ-డ్రైవ్, బ్యాటరీ తయారీ ప్రోత్సాహక పథకాలు అమలులో ఉన్నాయి.

అయితే ఇంకా పలు సవాళ్లు ఉన్నాయి. చార్జింగ్ కేంద్రాల కొరత, అధిక ప్రారంభ వ్యయం, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన లోపం, బ్యాటరీ రీసైక్లింగ్ సమస్యలు ప్రధాన అవరోధాలుగా ఉన్నాయి. ప్రభుత్వాలు ప్రజారవాణాను బలోపేతం చేయాలి. విద్యుత్ బస్సులు, మెట్రో రైళ్లు, సైకిల్ మార్గాలు, నడకకు అనుకూల నగరాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. ప్రతి పట్టణంలో తగిన చార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. స్థానిక సంస్థలు హరిత జోన్లను రూపొందించి కాలుష్య వాహనాల నియంత్రణ చేపట్టాలి.

హరిత రవాణా కేవలం పర్యావరణ పరిరక్షణకే కాదు; ఇంధన దిగుమతుల భారం తగ్గించడానికి, ప్రజల ఆరోగ్య రక్షణకు, దేశ ఆర్థిక స్థిరత్వానికి కూడా కీలకమైన మార్గం. భవిష్యత్ భారతం శుభ్రమైన గాలి, తక్కువ కాలుష్యం, స్థిరమైన అభివృద్ధి వైపు అడుగులు వేయాలంటే హరిత చలన విధానాల అమలు తప్పనిసరి.

# రైతన్నా మేలుకో... సాగు తీరు మార్చుకో!



పెరిగిన రసాయన ఎరువుల ధరలు: భారంగా మారుతున్న సాగు, సుస్థిర వ్యవసాయమే ఏకైక పరిష్కారం

దేశానికి అన్నం పెట్టే రైతు నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఒకవైపు వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, కరువు, తెగుళ్లు... మరోవైపు అమాంతం పెరుగుతున్న సాగు ఖర్చులు... పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడం ఇవన్నీ ఒకవైపు రైతును అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నాయి.

దీనికి తోడు డీజిల్, విత్తనాలు, కూలీల ఖర్చులతోనే నష్టాల్లో ఉన్న రైతుకు, ఇప్పుడు రసాయన ఎరువుల ధరల మోత మరింత భారమైంది.

వానాకాలం ప్రారంభంలోనే ఎరువుల ధరలు పెరగడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.ఒకప్పుడు జీవనాధారంగా ఉన్న వ్యవసాయం ఇప్పుడు "అప్పుల చక్రం"గా మారుతుండటంతో,రైతులు వ్యవసాయానికి దూరమయ్యే ప్రమాదం కనిపిస్తోంది.

**పెరిగిన ఎరువుల ధరలు: రెట్టింపైన సాగు వ్యయం**

ఇటీవల డీఏపీ, పొటాష్, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల ధరలు గణనీయంగా పెరిగాయి. 20-20-0-13, 28-28, 14-35-14 వంటి కాంప్లెక్స్ ఎరువులపై ఒక్కో బస్తాకు రూ.200 నుండి రూ.300 అదనపు భారం పడుతోంది.

ఇది కేవలం బస్తా ధర పెరగడం కాదు. మొత్తం సాగు వ్యయాన్ని రెట్టింపు చేస్తోంది. గతంలో ఎకరా వరి, పత్తి, మిర్చి సాగుకు ఎరువుల ఖర్చు రూ.4,000--5,000 ఉండగా, ఇప్పుడు రూ.7,000--10,000కు చేరింది. పత్తి, మిర్చి, మొక్కజొన్న, బత్తాయి, అరటి వంటి వాణిజ్య పంటల రైతులు తీవ్రంగా దెబ్బతింటున్నారు.

ఎక్కువ పెట్టుబడి పెట్టినా వాతావరణం అనుకూలించకపోయినా,ధరలు పడిపోయినా రైతుకు నష్టాలే మిగులుతున్నాయి..

సహకార రుణాలు సరిపోక, అధిక వడ్డీలకు ప్రైవేటు అప్పులు తెచ్చి సాగు చేస్తున్న చిన్న, సన్నకారు రైతులు పంట చేతికి వచ్చినా అప్పులు తీర్చలేని స్థితిలో ఉన్నారు.

**అంతర్జాతీయ ప్రభావం: రైతుపై నేరుగా భారం**

ఎరువుల ధరల పెరుగుదలకు దేశీయ కారణాలతో పాటు ప్రపంచ ఆర్థిక పరిస్థితులూ కారణమవుతున్నాయి.

దిగుమతులపై ఆధారపడటం: ఎరువుల తయారీకి అవసరమైన రాక్ ఫాస్ఫేట్, అమోనియా, సల్ఫర్‌ను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరిగితే ఆ భారం నేరుగా భారత రైతుపై పడుతోంది.

రూపాయి పతనం: డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతి ఖర్చులు పెరిగి, ఉత్పత్తి వ్యయం పెరిగింది.

. రవాణా మరియు ఇంధన వ్యయం: అంతర్జాతీయ రవాణా ఛార్జీలు, ఇంధన ధరలు పెరగడం కూడా ఎరువుల ధరలను ప్రభావితం చేస్తోంది.

సబ్సిడీలో కోత: ప్రభుత్వం సబ్సిడీ భారాన్ని తగ్గించే క్రమంలో కొన్ని ఎరువులపై ధరల నియంత్రణ సడలించడం రైతులకు పరోక్ష భారంగా మారింది.

**బ్లాక్ మార్కెట్ దందా: రైతు అవసరమే వ్యాపారం**

ధరల పెరుగుదలతో పాటు కృత్రిమ కొరత పెద్ద సమస్యగా మారింది. కొన్ని ప్రాంతాల్లో డీలర్లు ఎరువులను గోదాముల్లో నిల్వ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. సీజన్‌లో రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుని ఎంఆర్‌పీ కన్నా ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. "ఈ ఎరువు కావాలంటే ఇది కూడా కొనాలి" అంటూ బలవంతపు అమ్మకాలు జరుగుతున్నాయి.

రైతు అవసరం కొందరికి వ్యాపార అవకాశంగా మారడం బాధాకరం.

**రసాయనాల మోత: నిర్జీవముతున్న నేల**

ధరలు పెరిగినా దిగుబడి భయంతో రైతులు అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో నేల ఆరోగ్యం క్షీణిస్తోంది.- తగ్గుతున్న సేంద్రియ కార్బన్: నేల నీటిని నిల్వ చేసుకునే శక్తిని కోల్పోతోంది. తక్కువ వర్షానికే పంటలు ఎండిపోతున్నాయి. గట్టిపడుతున్న భూములు: అధిక రసాయనాలతో భూమి గట్టిపడి, వేర్లు లోతుకు వెళ్లలేక పంట ఎదుగుదల దెబ్బతింటోంది. - నశిస్తున్న సూక్ష్మజీవులు: వానపాములు, మిత్ర సూక్ష్మజీవులు, నేల జీవవైవిధ్యం అంతరించిపోతోంది. - ఆర్థిక భారం: నేల బలహీనపడే కొద్దీ మరింత ఎరువులు వేయాల్సి వస్తోంది. ఖర్చులు పెరిగినా దిగుబడులు స్థిరంగా లేక రైతు అప్పుల్లో కూరుకుపోతున్నాడు.

**పరిష్కారం ఎటు? సుస్థిర వ్యవసాయమే మార్గం**

. భూసార పరీక్షలు తప్పనిసరి: నేలలో ఏ పోషకాలు లోపించాయో తెలుసుకోకుండా ఎరువులు వేయడం వృథా. భూసార పరీక్షల ఆధారంగానే ఎరువులు వాడాలి.

సమగ్ర పోషక యాజమాన్యం : కేవలం రసాయనాలపై ఆధారపడకుండా జీవ ఎరువులు, సేంద్రియ ఎరువులు, సూక్ష్మపోషకాలు సమతుల్యంగా వాడాలి.

. జీవ ఎరువులకు పెద్దపీట: జీవామృతం, ఘన జీవామృతం, వర్మీకంపోస్ట్, బయో ఫర్టిలైజర్లు వాడితే ఖర్చు తగ్గడంతో పాటు నేల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

. పచ్చిరొట్ట ఎరువులు: జనుము, జీలుగా, సన్‌హెంప్‌ను భూమిలో కలియదున్నితే సేంద్రియ పదార్థం పెరిగి భూసారం మెరుగుపడుతుంది.

. పంట అవశేషాలు కాల్చొద్దు: వాటిని భూమిలో కలిపితే నేల జీవశక్తి పెరుగుతుంది.

. డ్రిప్ ఢ ఫెర్టిగేషన్: డ్రిప్ ద్వారా ఎరువులు ఇస్తే 30--40% వరకు వినియోగం తగ్గుతుంది. నీటి ఆదా కూడా అవుతుంది.

. పంటల మార్పిడి: ఒకే పంటను పదేపదే వేయడం వల్ల పోషకాల అసమతుల్యత ఏర్పడుతుంది కాబట్టి పంట మార్పిడి తప్పనిసరి.

**ప్రభుత్వం చేయాల్సినవి**

ఎరువుల బ్లాక్ మార్కెట్ పై ఉక్కుపాదం మోపాలి. రైతులకు ఎంఆర్‌పీ ధరలకే ఎరువులు అందేలా చూడాలి. సహజ, సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. ప్రతి మండలంలో భూసార పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలి. బయో ఫర్టిలైజర్లు, బయో స్టిమ్యులెంట్స్‌పై సబ్సిడీలు పెంచాలి.

రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధర హామీ ఇవ్వడంతో పాటు రైతు ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేయాలి.

**సుస్థిర వ్యవసాయమే భవిష్యత్తు**

ఇప్పటి వరకు "ఎక్కువ ఎరువులు - ఎక్కువ దిగుబడి" అనే భావనతో సాగు చేశాం. ఇప్పుడు పరిస్థితి మారింది. భూమిని కాపాడే వ్యవసాయం, రైతును నిలబెట్టే వ్యవసాయం, ఖర్చు తగ్గించే వ్యవసాయం, ప్రకృతిని పరిరక్షించే వ్యవసాయమే భవిష్యత్తు అని రైతులు అర్థం చేసుకోవాలి..

వ్యవసాయం అంటే కేవలం దిగుబడి కాదు. అది నేల ఆరోగ్యం, రైతు ఆర్థిక భద్రత, దేశ ఆహార భద్రత, ప్రకృతి సమతుల్యత, భవిష్యత్ తరాల జీవనాధారం.

రైతును కాపాడుకోవాలన్నా, నేలను కాపాడుకోవాలన్నా, భవిష్యత్ తరాలకు ఆహార భద్రత కల్పించాలన్నా ఇప్పుడు అవసరం:

"ఎక్కువ ఎరువులు కాదు... సమతుల్య పోషణ. ఎక్కువ ఖర్చు కాదు... సుస్థిర వ్యవసాయం.. అనే నినాదమే రైతును, నేలను బతికిస్తుంది

రైతు బతికితేనే దేశం బతుకుతుంది. నేల బతికితేనే మానవాళికి భవిష్యత్తు ఉంటుంది.



జి. అజయ్ కుమార్
వ్యవసాయ నిపుణులు

# నక్షత్రాలు వారిగా తంత్ర పరిహారాలు

( శ్రీనివాసరావు పుట్టా)

ప్రతి ఒక్కరు తమకు మంచి జరగాలని, అనుకున్న పనులు ఆటంకం లేకుండా నెరవేరాలని ఆశిస్తుంటారు. అందుకు కావలసిన పరిహారాలు చేస్తుంటారు. దానిలో భాగంగా నక్షత్రాల వారీగా తంత్ర పరిహారాలు కూడా ఉన్నాయి. ప్రముఖ ఆస్ట్రాలజిస్ట్ సర్వేశ్వరరావు మాటల్లో..

ఒకసారి వాటిని కూడా పరిశీలిద్దాం.



**అశ్వని పరిహారం**

వాయువ్యంలో గుఱ్ఱపు బొమ్మ లోహం తో చేసినది పెట్టండి.

**భరణి పరిహారం**

ఏ పప్పుతో అయినా పంచదార వేసి " పూర్ణం " తయారు చేసి లక్ష్మీ దేవికి నైవేద్యం పెట్టి తినాలి . భార్యకు తినిపించాలి.

**కృత్తిక పరిహారం**

తెల్లని పువ్వులు దేవాలయంలొ దానం ఇవ్వాలి . వేదజ్ఞుల ఆశీర్వాదం తీసుకోవాలి .కుల పురోహితుడి ఆశీర్వాదం తీసుకోవాలి .

**రోహిణి పరిహారం**

ఆవులకు ఆహారం తినిపించాలి. తెల్లటి ఎద్దును శివాలయం పుజించాలి. దానికి ఆహరం తినిపించాలి.

**మృగశిర పరిహారం**

అమ్మ వారికి యలుకులతో పుజ చేయించండి.అమ్మ వారి ఆలయం లో ఎర్రని గావంచాలు దానం చేయండి.పళ్ళు ఆలయంలో దానం చేయండి.సంగీతజ్ఞుల ఆశీర్వాదం తీసుకొండి.

పోస్ట్ మాన్ కు బట్టలు పెట్టండి.

**ఆర్ద్ర పరిహారం**

జంతు వధ నిరోధానికి తోడ్పడండి.రెండు పప్పు దినుసులు కలిసి ఆహారంగా ఉపయోగించండి.

దొంగలని పట్టించండి. లేదా పట్టుకోవడానికి సహాయపడండి

**పునర్వసు పరిహారం**

మేలి రకం బియ్యం మీ ఊరిలో గాని దగ్గరలో గాని పడమర దిశగా ఉన్న శివాలయం లొ దానం ఇవ్వండి.

**పుష్యమి పరిహారం**

బార్లి, గోధుమలు, బియ్యం , చెరుకు వీటిలో ఏ వస్తువు అయినా సరే యజ్ఞాలు చేసే వారికి అయినా సత్ప్రవర్తన కలిగిన వారికి ఎవరికి అయినా శివాలయం లో దానం ఇవ్వండి.

**ఆశ్రేష పరిహారం**

దుంప జాతి ఆహారాలను దానం ఇవ్వండి.పాము బొమ్మ చిన్నది సీసం తో చేయించి చెరువులో లేదా నుతిలో లేదా నదిలో వేయండి .

వైద్యులని సన్మానించండి .

**మఖ పరిహారం**

మాత,పితలను సేవించే వారిని వెతికి ఆశీర్వాదం పొందండి.కొండపై వెలసిన దైవ సన్నిధికి వెళ్లి దర్శనం చేసుకొండి.

**పుబ్బ పరిహారం**

నట,సంగీత ,కళాకారులను గౌరవించండి.తేనే దానం ఇవ్వండి.

**ఉత్తర పరిహారం**

ఉత్తమ ధాన్యము ను సత్ప్రవర్తన గలవారికి దానం చేయండి .

**హస్త పరిహారం**

వెండి ఏనుగు బొమ్మ లేక గణపతి విగ్రహం వేద పండితునికి దానం చేయండి.వేద పండితుల శిష్యరికం చేయండి .

**చిత్త పరిహారం**

యాలుకలు, కస్తూరి, లవంగాలు, పునుగు, జవ్వాది ఇవన్ని ఎర్ర వస్త్రంలో కట్టి దానం ఇవ్వండి.చేనేత వస్త్రం నేసేవారికి బహుకరించండి.

చనిపొయిన తరువాత నేత్ర దానం చేసేలా వీలునామా రాయండి.

**స్వాతి పరిహారం**

2 కిలొల శనగ పప్పు దైవ ధ్యానలో గడిపే వారికి దానం చేయండి .

**విశాఖ పరిహారం**

ఉత్తర దిశలొ పై మొక్కలు పెంచండి.

శనగలు దానం ఇవ్వండి.

**అనురాధ పరిహారం**

బియ్యం , కొబ్బరి, ఖర్జూరం , బెల్లం ఇవన్ని మిశ్రమం తయారు చేసి దానం ఇవ్వండి.

**జ్యేష్ట పరిహారం**

కంచు పాత్రలో కర్పూరం వేసి సైనికునికి దానం చేయండి .

**మూల పరిహారం**

పేదలకి ఉచితం గా వైద్యం చేయడానికి ఆయుర్వేదిక్ వైద్యునికి మందుల డబ్బులు ఇచ్చిరండి.

**పుర్వాషాడ పరిహారం**

ఏనుగులకు అరటిపళ్ళు తినిపించడానికి మావటి వాళ్లకు ఇచ్చి దగ్గర ఉండి తినిపించండి.

**ఉత్తరాషాఢ పరిహారం**

చెప్పులు ఇవ్వండి.

పడుకుని ఉన్న దేవత/దేవుళ్లు కి పన్నీరుంతేనె ఇవ్వండి..

**శ్రవణం పరిహారం**

శ్రీ వెంకటేశ్వర క్షేత్రానికి వెళ్లి విష్ణు దర్శనం , విష్ణు భక్తుల దర్శనం చేసుకు రండి.

**ధనిష్ట పరిహారం**

గొధుములు పుణ్యాత్ములకు శివాలయం లొ దానం చేయండి .

**శతబిషం పరిహారం**

కొంత మద్యాన్ని నీటిలో ప్రవహింప జేయండి .

**పుర్వాబాధ్ర పరిహారం**

కొంత నెయ్యి ఒంటరిగా జీవించే సత్పురుషులకి ఇచ్చి రండి.

**ఉత్తరాబాధ్ర పరిహారం**

కోవాను ప్రత్యేకం గా తయారు చేయించి 8 మంది వృద్ధ బ్రాహ్మణులకు శివాలయం లో దానం ఇవ్వండి.

**రేవతి పరిహారం**

పద్మములు,సువాసన గల పుష్పాలు , యలుకులు,కస్తూరి , పునుగు,జువ్వాది ఇవన్ని తయారు చేసి శివాలయం లో దానం చేయండి.ప్రతి నక్షత్రంలో పుట్టిన జాతకులు కొన్ని దానాలు చేయడం వలన ఆ జాతకుల భవిష్యత్తు ఆనందకరంగా ఉంటుంది.అలాగే హొమాలు,జపాలు చేయించుకోవలసి ఉంటుంది.అవి చాలా ఖర్చుతో కూడుకొని ఉంటాయి .అలా చేయించుకోలేని వారి కోసం తంత్ర శాస్త్రం ప్రకారం వీటిని పాటించి సంతొషంగా ఉండగలరుని భావిస్తూన్నా0.

# ఆర్.భీమవరంలో ఎంఎస్ఎం పార్కుకి శంకుస్థాపన

**బుచ్చయ్యపేట జయ జయహే**




ఈరాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ తెలిపారు.మండలంలోని సోమవారం ఆర్.భీమవరంలో ఎంఎస్ఎంఈ పార్క్ శంకుస్థాపనలో పాల్గొన్నారు.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా వివిధ జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేయనున్న 38 ఎంఎస్ఎంఈ పారిశ్రామిక పార్కులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో విజయవాడ నుండి శంకుస్థాపనలు చేశారు.కలెక్టర్ మాట్లాడుతూ... అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్నారు.జిల్లాలో 172 చిన్న పరిశ్రమలకు భూములు కేటాయించామన్నారు.2027 డిసెంబర్ నాటికి ఇవి ప్రారంభించబడతాయన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలను కనీసం డిగ్రీ వరకు చదివించాలని సూచించారు.భవిష్యత్తులో స్కిల్ డెవలప్మెంట్ లో శిక్షణ ఇచ్చి ప్రభుత్వమే ఉద్యోగాలు కల్పిస్తుంది అన్నారు.రైతులు సహకరిస్తేనే కొత్త పరిశ్రమలు వస్తాయి అన్నారు. ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. చోడవరం నియోజకవర్గాన్ని వ్యవసాయ హబ్ గా తీర్చిదిద్దుతామన్నారు.సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో 80 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు.మూతపడిన గోవాడ సుగర్స్ స్థానంలో డిష్టలరీ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి అన్నారు.మొక్కజొన్న సాగును ప్రోత్సహించవచ్చు అన్నారు.స్టేట్ హౌసింగ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ.. సమర్ధత కలిగిన సిం చంద్రబాబు సారథ్యంలో అనకాపల్లి జిల్లా పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.నెలకొక కొత్త ఫ్యాక్టరీ కి జిల్లాలో శంకుస్థాపన చేస్తున్నారని అన్నారు.జనసేన ఇన్చార్జి పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ... ఎమ్మెస్ఎంఈ పార్కు ఏర్పాటుకు ఎంపిక చేసిన ఈ స్థలంను కడియాల రాజేశ్వరరావు అనే వ్యక్తి ప్రభుత్వానికి అప్పగించారని గుర్తు చేశారు. వ్యవసాయాన్ని,పరిశ్రమలని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు.జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్,ఏపీఐఐసీ జోనల్ డిప్యూటీ మేనేజర్ సూర్యనారాయణ, తాసిల్దార్ ఎంలక్ష్మి, ఎంపీడీవో శివప్రసాద్, విశాఖ డైరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, ఎంపీపీ డి.నాగేశ్వరీ దేవి,కూటమి నేతలు జి.కోటేశ్వరరావు, వియ్యపు అప్పారావు, తమరాన దాసు, కోరుకొండ రవికుమార్, ముచ్చకర్ల తాతయ్యలు, మలిరెడ్డి బాబ్జి, దొడ్డి కిషోర్, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# పవన్ కళ్యాణ్ పర్యటనపై మేడా శ్రీనివాస్ విమర్శలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా ఆర్యాపురం ప్రాంతంలో విధించిన ఆంక్షలు ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలిగించాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ నాయకుడు మేడా శ్రీనివాస్ విమర్శించారు. సాధారణ పర్యటనకే అధికారులు, పోలీసులు ఇంత హైరానా పడితే 2027 గోదావరి పుష్కరాలను ఎలా సమర్థంగా నిర్వహిస్తారో ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.ఆర్యాపురం ప్రాంతంలో రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఉన్న వీధిలో అత్యవసర ఆసుపత్రులు, విద్యాసంస్థలు, దేవాలయాలు, కళ్యాణ మండపాలు ఉన్నాయని, అలాంటి కీలక ప్రాంతాన్నే పర్యటనకు ఎంపిక చేయడం అనాలోచిత నిర్ణయమని పేర్కొన్నారు. గత పది రోజులుగా పారిశుద్ధ్య సమస్యలు ఉన్నప్పటికీ ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఒక్కసారిగా శుభ్రపరిచారని, దీనిపై రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ పనితీరుపై విమర్శలు వస్తున్నాయని తెలిపారు.పర్యటన సందర్భంగా వీధిలో వాహనాలు నిలపరాదంటూ కఠిన ఆంక్షలు విధించడం వల్ల స్థానిక నివాసితులు, అంబులెన్స్ సేవలకు ఇబ్బందులు తలెత్తాయని అన్నారు. ప్రత్యామ్నాయంగా సుబ్రహ్మణ్యం మైదానంలో వాహనాల పార్కింగ్‌కు అవకాశం కల్పించాల్సిందని సూచించారు.అలాగే మండుటెండలో విధులు నిర్వహించిన పోలీసులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, కానిస్టేబుల్ నుంచి ఎస్ఐ స్థాయి వరకు పలువురు తీవ్ర ఎండబారిన పడ్డారని పేర్కొన్నారు. మంచినీరు వంటి ప్రాథమిక వసతులు కూడా అందుబాటులో లేవని ఆరోపించారు.ఈ పర్యటన కంటే సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించి ఉండవచ్చని ప్రభుత్వ అధికారులే చర్చించుకుంటున్నారని మేడా శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్ పుష్కరాల నిర్వహణ బాధ్యతలను సమర్థులైన అధికారులకు అప్పగించాలని, లేకపోతే ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# బాటసారూలకు దాహార్తిని తీర్చుతున్న కమ్యూనిటీ ఫ్రిడ్జ్

**చోడవరం మే 25 జయ జయహే**



చోడవరంలో సిడివిఎం కమ్యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సద్భావ టీం నిర్వహిస్తున్న కమ్యూనిటీ ఫ్రిడ్జ్ బాటసారులకు ఆకలని దాహార్తినీ తీర్చుతుంది. సద్భావ టీం ఆధ్వర్యంలో స్థానిక స్వైబూ విగ్నేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో కమ్యూనిటీ ఫ్రిజ్జు ఏర్పాటు చేశారు. దీని ద్వారా నిత్యం పాఠశాలలకు మంచినీరు మజ్జిగ మధ్యాహ్నం భోజనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎందుకు నిత్యం కూడా దాతలు సహకార అందిస్తున్నారు. ఎవరు ముందుకు రాని సమయంలో సద్భావ టీం ముందుకు వచ్చి ఈ కార్యక్రమంలో నిర్వహిస్తుంది. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు ముందుకు వచ్చి ఇళ్లల్లో జరిగే శు భకార్యాలు తోపాటు వివిధ కార్యక్రమాల సమయంలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు ఉదయం 16 ఏర్పాటు మజ్జిగ మంచినీళ్లు పంపిణీ వంటి కార్యక్రమాలను చేపడుతున్నారు. దీంతో కమ్యూనిటీ ఫ్రీ అందిస్తున్న సేవలను పలువురు ప్రముఖులు కొనియాడుతున్నారు. దాతలతో పాటు సద్భావ టీం సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సేవలు అందిస్తున్నారు. కొప్పాక రాజేష్ ఫౌండర్ గా సిడివిఎం కమ్యూనిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సద్భావ టీం ఈ కార్యక్రమం నిర్వహిస్తుంది. సోమవారం చోడవరం పట్టణానికి చెందిన పి రాంజీ సహకారంతో మజ్జిగ పంపిణీ చేపట్టారు

# కొయ్యూరులో మే 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు...

**నాయకులు, కార్యకర్తలకు ఆహ్వానం..**

**కొయ్యురు :(జయ జయహే )న్యూస్ మే 26**



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, పాడేరు నియోజకవర్గ ఇంచార్జి గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ మహానాడు సభలు మే 27, 28 తేదీలలో కొయ్యూరు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు మండల పార్టీ ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు తెలిపారు. ఈ రెండు రోజులు జరిగే మహానాడు పండుగను తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని తోట దొరబాబు కోరారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మహానాడులో చర్చిస్తారని పేర్కొన్నారు.

# పంచాయతీ వనం ఏర్పాటుతో గ్రామాలకు హరితహారం

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**





గ్రామపంచాయతీలో దేశీయ వృక్ష జాతులతో ప్రత్యేక "పంచాయతీ వనం" ఏర్పాటు చేసి గ్రామాలకు హరితహారం అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామపంచాయతీలకు ఆదాయ వనరులు పెంచే దిశగా పంచాయతీరాజ్ శాఖ, అటవీశాఖలు సంయుక్తంగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు.

రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం రాజనగరంలోని ప్రాంతీయ అటవీ అభివృద్ధి పరిశోధన కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ పెంచుతున్న దేశీయ జాతి మొక్కలు, వాటి ప్రత్యేకతలు, ఉపయోగాలపై అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో సుమారు 400 రకాల విభిన్న జాతుల మొక్కలు, రెండు లక్షలకు పైగా మొక్కలు ఉన్నాయని అధికారులు వివరించగా ఉప ముఖ్యమంత్రి ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ మొక్కలను విస్తృతంగా పెంచడం ద్వారా ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుందని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో ప్రత్యేక వనాలను అభివృద్ధి చేసి గ్రామీణ ప్రజలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. మొక్కల సంరక్షణ బాధ్యతను గ్రామస్థులు తీసుకుంటేనే వనాల అభివృద్ధి సాఫీగా సాగుతుందని పేర్కొన్నారు.అటవీ శాఖ అధికారులతో ప్రత్యేక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకొని పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రతి పంచాయతీలో దేశీయ మొక్కలు నాటేలా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజకు ఆదేశించారు. కలప, పండ్ల ద్వారా ఆదాయం వచ్చే మొక్కలను పెంచితే గ్రామపంచాయతీలకు ఆర్థికంగా మంచి లాభాలు వస్తాయని తెలిపారు.విదేశాల్లో కలపకు డిమాండ్ అధికంగా ఉందని, తక్కువ సమయంలో పెరిగే వృక్షాలను పెంచడం ద్వారా పంచాయతీలు ఆదాయం పొందవచ్చని చెప్పారు. గ్రామాల్లో పిల్లలకు మొక్కల పెంపకం, సంరక్షణపై బాధ్యతలు నేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తదితరులు పాల్గొన్నారు.



# పొదుపు మన అందరి బాధ్యత

**బాధ్యతాయుత జీవనానికి పొదుపు ఓ వరం**

**బిజేపి జనతా వారిది విస్తృత కార్యక్రమాలు**

**టెక్కలి మే 25 జయ జయహే**

దేశం లో భారతీయ జనతా పార్టీ ప్రజల భావితరాల భవిష్యత్తు జీవన విధానం కోసం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇ చ్చిన పిలుపుతో భారతీయ జనతా పార్టీ టెక్కలి నియోజకవర్గంలో విస్తృతంగా జనతా వారధి కార్యక్రమంలో భాగంగా పొదుపు జాగ్రత్తలు బాధ్యతాయుత జీవన విధానా ల కోసం ప్రచారం నిర్వహిస్తున్న మని బిజెపి టెక్కలి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ తెలిపారు. ఈ మేరకు టెక్కలి ఆర్డీవో కార్యాలయం ఏవో కు వినతి పత్రం అందజేశామన్నారు. దేశంలో శరవేగంగా మారుతున్న పరిస్థితులు, పక్క దేశాల యుద్ధాల ప్రభావాలతో పెరుగుతున్న ఆర్థిక అస్థిరత్వం , ఇంధన ధరలు, నీరు విద్యుత్తు వంటి వనరులపై పెరుగుతున్న ఒత్తిడి నేపథ్యంలో బాధ్యతాయుత జీవన విధానాన్ని అలవర్చుకోవాలని బిజెపి అధినాయకత్వం భావిస్తుందని రాంజీ అన్నారు. గ్రామస్థాయిలో సమగ్రమైన పొదుపును అన్ని విధాలుగా కొనసాగించేందుకు భవిష్యత్తు భద్రత అంశాలపై అవగాహన కార్యక్రమాలను గ్రామ, వార్డు, సచివాలయం, మహిళా స్వయం సహాయక సంఘాలతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జర్జన రాంజీ తెలిపారు, ఈ కార్యక్రమంలో భాగంగా బిజెపి టెక్కలి మండల ఉపాధ్యక్షుడు వడిసి బాబురావు , పీస లవణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# పీజీ ఆర్ఎస్‌లో మహిళకు వడదెబ్బ

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఓ మహిళ వడదెబ్బకు గురికావడంతో అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి వైద్యసేవలు అందించింది. కల్లేపల్లి ప్రియాంక అనే మహిళ పెన్షన్, రేషన్ కార్డు సమస్యలపై అర్జీ ఇవ్వడానికి రావడంతో ఎండ తీవ్రత, వడగాల్పుల ప్రభావంతో అస్వస్థతకు గురైంది.సమాచారం అందుకున్న అధికారులు వెంటనే ఆమెకు తాగునీరు అందించి ప్రాథమిక చికిత్స చేపట్టారు. అనంతరం నర్సింగ్ సిబ్బందిని పిలిపించి రక్తపోటు, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పరిస్థితిని పరిశీలించిన తర్వాత 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి టి. సీతారామమూర్తి మాట్లాడుతూ, ప్రియాంకకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆమె ఆరోగ్యం కుదుటపడేలా వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. అలాగే ఆమె పెన్షన్, రేషన్ కార్డు సమస్యలను పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో పరిశీలించగా సంబంధిత దరఖాస్తు ఇప్పటికే ఆమోద దశలో ఉన్నట్లు గుర్తించామని వెల్లడించారు.ప్రస్తుతం వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అత్యవసర పరిస్థితులు తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని సూచించారు. వడగాల్పులు, ఎండ తీవ్రత దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవసరమైతే ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్ 1100 ద్వారా కూడా ప్రజలు తమ అర్జీలు, ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డా. ఎం. పద్మ, జిల్లా హౌసింగ్ అధికారి నాతి బుజ్జి తదితర అధికారులు పాల్గొన్నారు.



# మహానాడు విజయవంతం చేయాలి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "డిజిటల్ మహానాడు--2026" విజయవంతానికి రాజమహేంద్రవరం నగరం సిద్ధమవుతోంది. ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడుకు సంబంధించి తిలక్ రోడ్డులోని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కార్యాలయంలో సోమవారం జిల్లా కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకట రమణ చౌదరి హాజరై మహానాడు నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా సమీక్షించారు. పార్టీ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నిర్వహిస్తున్న డిజిటల్ మహానాడును ప్రతి కార్యకర్తకు చేరువ చేయాలనే ఉద్దేశంతో నగరంలోని 12 ప్రాంతాల్లో ప్రత్యేక డిజిటల్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ప్రత్యక్ష ప్రసారం కానున్న మహానాడు కార్యక్రమాలను కార్యకర్తలు, అభిమానులు సౌకర్యవంతంగా వీక్షించేలా భారీ ఎల్ఈడి స్క్రీన్లు, సౌండ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ సదుపాయాలు, తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. క్లస్టర్ వారీగా నాయకులకు సమన్వయ బాధ్యతలు అప్పగించారు.అలాగే మహానాడు సందర్భంగా పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సోషల్ మీడియా ప్రచారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ మహానాడు పార్టీ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త మహానాడును తన ఇంటి కార్యక్రమంగా భావించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకట రమణ చౌదరి మాట్లాడుతూ సాంకేతికతను అందిపుచ్చుకుంటూ పార్టీ ప్రజలకు మరింత చేరువవుతోందని, డిజిటల్ మహానాడు పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని అన్నారు.ఈ సమావేశంలో టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీ నవీన్ కుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న గండి బాబ్జీని అడ్డుకోండి....!

### పీజీఆరఎస్‌లో పిర్యాదు

**విశాఖపట్నం, మే 25, జయ జయహే :**



పెందుర్తి పరిసరాల్లో టీడీపీ నేత గండి బాబ్జీ భారీ ఎత్తున ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని మహిళలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. అనంతరం పీజీఆరఎస్‌లో ఫిర్యాదు చేశారు. పెందుర్తి మండలం, దగ్గువానిపాలెం, రాడివారి కల్లాలు సర్వే నంబర్ 107/11లో గల 8.08 ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణ సాగిస్తున్న గండి బాబ్జి చట్ట విరుద్ధ చర్యలను అడ్డుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర అధ్యక్షులు ఎం.లక్ష్మి, ఐ యఫ్ టి యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం. వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు. అదే భూమిపై ఇళ్ళు కట్టుకొని నివసిస్తున్న అర్హులైన పేదలకు ఇళ్లపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ బాధితులతో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన నిర్వహించారు. అనంతరం వారు బాధితులతో కలిసి పిజిఆరఎస్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మి, వెంకటేశ్వర్లు మీడియాతో మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలోని రాడివారి కల్లాలకు చెందిన 107/11 సర్వే నెంబర్ లోని భూమి ప్రభుత్వ భూమిగా ప్రభుత్వ విచారణ ద్వారా గుర్తించారని తెలిపారు. సదరు భూమిపై తమకు హక్కులు ఉన్నట్లుగా గండి బాబ్జి, ఎంవివి బిల్డర్స్, అప్పలనాయుడు తదితరులు గత కొన్ని ఏళ్లుగా వ్యాజ్యాలు నడిపిన, వారికి అనుకూలంగా రిపోర్టు రాలేదన్నారు. అదే సందర్భంలో అనేక దఫాలుగా దురాక్రమించడానికి వారంతా ప్రయత్నించారని వాళ్ళు ఆరోపించారు. ఇవన్నీ మీడియా ద్వారా బహిర్గతం అయ్యాయని గుర్తు చేశారు. అయితే చాలా కాలంగా అక్కడ నివసిస్తున్నట్లు విచారణ ద్వారా ప్రభుత్వ విభాగాలు గుర్తించాయని తెలిపారు. ప్రభుత్వ భూమిలో ఇండ్లు నిర్మించుకొని ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ పథకంలో భాగంగా 30-03-2026న దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే గండి బాబ్జి ఒత్తిడితో ఏ కారణం చెప్పకుండానే వాటిని అధికారులు రిజెక్ట్ చేశారని తెలిపారు. ఇప్పుడు గండి బాబ్జి తదితరులు, ఈనెల 19 నుండి సర్వే నంబర్ 107/11లో గల ప్రభుత్వ భూమిని దురాక్రమించడానికి ట్రాక్టర్లను, బుల్డోజర్లను ఉపయోగించి పెద్ద ఎత్తున ఆ భూమిని చదును చేసి రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఇందిర, ఐ యఫ్ టి యు రాష్ట్ర నాయకులు నివాసితులు పాల్గొన్నారు.

# గడువులోగా బాధితుల సమస్యలు తీర్చండి...!



### అధికారులకు వీఎంఆర్‌డిఏ కమిషనర్ తేజ్ భరత్ ఆదేశం

**విశాఖపట్నం, మే 25, జయ జయహే**

వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించి బాధితుల నుంచి మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ వినతులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్య లపై సంబంధిత అధికారులతో వెను వెంటనే మాట్లాడి వాటిని సత్వరమే పరిష్కరించేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. సమస్యపై గడువులోగా బాధితులకు సరైన సమాచారం ఇవ్వాలని సూచించారు. బాధితులు ఎక్కువ సార్లు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అవసరమైతే క్షేత స్థాయిలో పరిశీలించి, తగిన న్యాయం చేయాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కి మొత్తం 6 వినతులు రాగా వాటిలో ప్లానింగ్ 2, ఇంజనీరింగ్ 1, ఎస్టేట్ 2, ఇతర సేవలకు సంబంధించి 1 చొప్పున వినతులు వచ్చాయి. కార్యక్రమంలో కార్యదర్శి మురళీ కృష్ణ, డిఎఫఓ శిరీష, ముఖ్య ప్లానింగ్ అధికారి దివ్య లత, ముఖ్య గణాంక అధికారి హరి ప్రసాద్ ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## 2.5 కోట్ల విత్తన బంతులు కార్యక్రమం జయప్రదం చేద్దాం

**- అటవీశాఖకు విత్తన బంతులు, దేశీయ విత్తనాలు అందచేద్దాం**

**- శీతోష్ణస్థితి వేడెక్కకుండా కృషి చేద్దాం**

**- మన చేతుల్లోనే మన వాతావరణం: జె వి రత్నం**

**విశాఖపట్నం (జయ జయహే)**

2.5 కోట్ల విత్తన బంతులు కార్యక్రమం జయప్రదం చేద్దాం అని గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం విశాఖపట్నం ఈజిల్లా పెందుర్తి మండలం పెద్ద గాడి దగ్గర ఉన్న సంకల్ప కళా గ్రామం లో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన విత్తన బంతుల తయారీ కోసం సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు వంద కిలోల చింత గింజలు అందజేసిన అనంతరం రత్నం మాట్లాడారు. అటవీశాఖకు విత్తన బంతులు, దేశీయ విత్తనాలు అందచేద్దాం అని అన్నారు. ప్రతి ఒక్కరూ చింత గింజలు, కొంకుడు గింజలు, మనం తినే మామిడి పండ్ల టెంకలు, నేరేడు, సపోటా, రామాఫలం, శీతాఫలం, లక్ష్మణా ఫలం, నారింజ , బత్తాయి, కెమెరా, ఉసిరి తదితర దేశీయ విత్తనాలు అందచేద్దాం అని అన్నారు. ఈ ఏడాది శీతోష్ణస్థితి వేడెక్కిన తీరు మనం చవిచూశాం. భవిష్యత్తులో ఈ వేడి ఇంకా పెరగకుండా ఉండడానికి విపరీతంగా చెట్లు పెంచాలి, భూగర్భ జలాలు పెంపొందించాలని కోరారు. విత్తనాలు అందచేద్దాం వాటి ద్వారా అటవీశాఖ కృషి తో పెరిగిన సామాజిక వనాలు పెంచుదామని, తద్వారా శీతోష్ణస్థితి వేడెక్కకుండా ఉండే అవకాశం ఉందని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మన చేతుల్లోనే మన వాతావరణం ఉంటుంది అని ప్రతి ఒక్కరూ తెలుసు కోవాలి అని ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్ని వివరించారు.ఈ కార్యక్రమంలో సంకల్ప కళా గ్రామం ప్రతినిధులు ఆకుల చలపతిరావు, పార్వతి, జమీలియా, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ తదితరులు పాల్గొని మాట్లాడారు.

## ఎన్‌జీజీవోస్ కాలనీ అధ్యక్షునిగా పీవీ కృష్ణారావు

**అక్కయ్యపాలెం, మే 25, జయ జయహే :**



అకయ్యపాలెం నివాసితుల సంక్షేమ సంఘం తాత్కాలిక కమిటీ సభ్యుల సమావేశం జరిగిందని పాలక మండలి సభ్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నూతన పాలక మండలి కమిటీ ఏర్పాటును కూడా సభ్యులు ఆమోదించారు. ఈ కమిటీలో సీహెచ్ రామకృష్ణ, సీహెచ్ విజయ కుమారి, కే. జగదీశ్వర రావు, పి. నర్సింగ రావు, కే. రామా రావు, కేవీ శర్మ, కే. దిల్లీ రావు, పీఎన్ శ్రీనివాస రావు, ఎం. రామచంద్రరావు, వీఎసఎల్ నరసింహంలను సభ్యులు ఆమోదించారు. అలాగే అధ్యక్షునిగా పి. వెంకట కృష్ణ రావు, ఉపాధ్యక్షునిగా పీవీ రమణ మూర్తి, కార్యదర్శిగా ఎస్ . రవి కుమార్, సంయుక్త కార్యదర్శిగా కే. యోగేంద్ర ప్రసాద్, కోశాధికారిగా ఆర్వీ చంద్రశేఖర్ రావులను కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా నామినేట్ చేసినట్టు వివరించారు.




## మా భూములకు పట్టాలు మంజూరు చేయాలి

**ఎల్ ఎన్ పేట మండల గిరిజనులు డిమాండ్**

**టెక్కలి మే 25 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా లక్ష్మీ నర్సు పేట మండలం లోని బెన్నాడి గూడ, కొత్తగూడ, గోలుకొప్ప గ్రామాల గిరిజన రైతులు టెక్కలి ఆర్డిఓ కార్యాలయం వద్ద తమ భూములకు పట్టాలు మంజూరు చేయాలని ధర్నా నిర్వహించి డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఏవో రషీద్ కు వినతిపత్రం అందజేశారు, సుదీర్ఘకాలంగా ఈ భూములను గిరిజనుల సాగులో ఉన్నాయని వీటిని గిరిజన నే తరులు స్వహాసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రభుత్వం తక్షణమే ఈ భూ ములను గిరిజన రైతుల పేరిట ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు కామ్రేడ్ దేగ ప్రభాకర్ డిమాండ్ చేశారు, ఆయనతోపాటు గిరిజనులు ఈ ధర్నాలో పాల్గొన్నారు.



## ఏం ఎస్ ఎం ఈ పార్క్‌కి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే

**చోడవరం,జూన్ 25,జయ జయ హే**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయవాడలో సోమవారం వర్చువల్ గా ఏం ఎస్ ఎం ఈ పార్కులను ప్రారంభించిన నేపద్యంలో స్తానిక శాసనసభ్యులు కే ఎస్ ఎన్ ఎస్ రాజు కూడా సోమవారం పి భీమవరం గ్రామంలో ఎం ఎస్ ఎం ఈ పార్క్ స్థలం వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కుమార్ కృష్ణన్ జాయింట్ కలెక్టర్ , నియోజవర్గం ముఖ్య కూటమి నాయకులు , మండల ముఖ్య నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇక్కడ రైతులందరికీ రాబోయే రోజుల్లో సృజన స్రవంతి వస్తుందని, అలాగే పార్కు ద్వారా యువత యువకులకు ఉద్యోగం వస్తుందన్నారు. అలాగే భూమి ఇచ్చిన రైతులందరికీ ఎల్లప్పుడు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

## వైసిపి పి ఆర్ జే ఎస్‌గా లింగబాబు

**చోడవరం మే 25 జయ జయహే**



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పంచాయతీరాజ్ రాష్ట్ర విభాగం సంయుక్త కార్యదర్శిగా (జాయింట్ సెక్రెటరీ) చోడవరం మండలానికి చెందిన సీనియర్ నాయకుడు అప్పికొండ లింగ బాబును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని లింగ బాబు సోమవారం పత్రికలకు తెలిపారు. ఈ సందర్భంగా చోడవరం సమన్వయకర్త మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తో పాటు పలువురు లింగబాబును అభినందించారు.

## మోదకొండమ్మ వారి ఆలయ అభివృద్ధికి 45000 విరాళం

**మాడుగుల మే 25 జయ జయహే**



మాడుగుల మండలం ఎంకోడూరు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి హైదరాబాద్కు చెందిన దొడ్డి గణేష్ రాధా దంపతులు 45 వేల రూపాయలు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి సంజీవరావు సోమవారం తెలిపారు. ఈ డబ్బుతో గర్భగుడిలో ఏసి వేయించాలని దాతలు కోరినట్టు తెలిపారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ అభినందించింది. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## ఉపాధి కూలీలకు ఆర్థికపరమైన భద్రత కల్పించిన కేంద్ర ప్రభుత్వం

**మాడుగుల మే 25 జయ జయహే**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న "ఉపాధి హామీ పథకాన్ని వికసిత్ భారత్ గ్యారెంటీ పర్ రోజ్ గార్ అండ్ అజావిక మిషన్" గ్రామీణ గా మార్చింది. దాంట్లో భాగంగా సోమవారం విమాడుగుల మండలం ఎం కోటపాడు లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద భారతీయ జనతా పార్టీ కిషన్ మోర్చా మండల ఉపాధ్యక్షుడు తాటికొండ స్వామి, భారతీయ జనతా పార్టీ మండల ప్రధాని కార్యదర్శి ఎం సతీష్ , భారతీయ జనతా పార్టీ కిషన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు కలిసి కూలీలకు మిషన్ విధివిధానాలను వివరించారు. గతంలో చేసిన పనికి సంబంధించిన డబ్బులు సక్రమంగా అందేవి కావు నేడు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ మిషన్ ద్వారా కూలీలకు నేరుగా ఆధార్ సీడింగ్ ఉన్న వారు బ్యాంక్ అకౌంట్ కి నేరుగా జమ అవుతున్నాయని తెలిపారు. కష్టపడే ప్రతి కూలీకి ఏ నష్టం జరగకుండా ఉండటమే ఈ మిషన్ ముఖ్య ఉద్దేశ్యం అని కూలీలకు అందరికీ తెలియజేసి, ఎండలు ఎక్కువగా ఉండడం కారణంగా వచ్చిన ప్రతి కూలీలకి శీతల పానీయాలు అందజేశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక భద్రత వలన మేము ఎంతో ఆనందంగా ఉన్నామని హర్షం వ్యక్తం చేశారు.



## రోలుగుంటలో న్యూ అడ్మిషన్స్ ప్రచారం

**రోలుగుంట, మే 25: జయ జయ హే**

రోలుగుంట పి.ఎం. శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యార్థుల అడ్మిషన్ల పెంపు లక్ష్యంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీ.వి. శేషగిరిరావు , ఆంగ్ల ఉపాధ్యాయిని పి.వి.ఎం. నాగజ్యోతి సోమవారం గ్రామంలో డోర్ టు డోర్ క్యాంపెయినింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి, ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న నాణ్యమైన విద్య, ఆధునిక సౌకర్యాలు, ఉచిత పథకాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అలాగే పి.ఎం. శ్రీ పాఠశాలలో అందుబాటులో ఉన్న డిజిటల్ తరగతి గదులు, ఐఎఫ్పీ ప్యానెల్స్, ల్యాబ్ సౌకర్యాలు, క్రీడలు, సహపాఠ్య కార్యక్రమాలు , విద్యార్థులు సాధిస్తున్న ఉత్తమ ఫలితాల గురించి తెలియజేశారు.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, ట్యాబ్స్ తదితర పథకాల వివరాలను కూడా తల్లిదండ్రులకు వివరించి, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమం వల్ల పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని ప్రధానోపాధ్యాయులు టీ.వి. శేషగిరిరావు ఆశాభావం వ్యక్తం చేశారు.




## ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని ఆర్ డి ఓ కార్యాలయం వద్ద ఆందోళన

**నక్కపల్లి (జయ జయహే)**

అనకాపల్లి జిల్లా, నక్కపల్లి మండలం లో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ నిర్మాణం లో భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలలో 2016 నుండి 2024 డిసెంబర్ మధ్యలో వివాహం అయిన ఆడ పిల్లలకు అధికారులు వివిధ సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం అడ్డు రోడ్డు ఆర్ డీ ఓ కార్యాలయం వద్ద మూలపర్ర గ్రామానికి చెందిన ఆడపిల్లలు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో ఆందోళన వ్యక్తం చేశారు, అనంతరం డివిజనల్ పరిపాలనా అధికారి నాగరాజు కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డిఏఓ వినతి పత్రం ఆర్ అండ్ ఆర్ అధికారి, రెవెన్యూ డివిజన్ అధికారి వారి దృష్టి తీసుకు వెళ్తానని తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు భూములు, ఇళ్లు, సర్వం కోల్పోయిన ఇళ్ళలో 2016 నుండి 2024 మధ్య వివాహం అయిన ఆడ పిల్లలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్యాకేజీ చెల్లిస్తామని, భూములు, గ్రామాలు తరలించే సందర్భంగా జరిగిన గ్రామ సభలలో రెవెన్యూ, ఏపిఐఐసి అధికారులు హామీలు ఇవ్వడం జరిగింది, నిర్వాసితులు జాబితాలో కూడా ఆడ పిల్లలు పేర్లు పొంది పర్చి , ఇప్పుడు ఎక్కడా ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వలేదని,2013 భూసేకరణ చట్టం లేదని ప్యాకేజీ ఇవ్వకుండా ఎగ్గొట్టి డానికి కారణాలు అన్వేషిస్తున్నారు తప్పా ఏ విధంగా ఆడపిల్లలకు ప్యాకేజీ ఇవ్వాలని అధికారులు ఆలోచించడం లేదు,2013 భూసేకరణ చట్టం, చట్టం లో ఉన్న సౌకర్యాలు తప్పకుండా అమలు చేయాలని మరియు రాష్ట్ర ప్రభుత్వం,ఆ జిల్లా కలెక్టర్ 2013 చట్టంలో లేనివి కూడా స్థానిక అవసరాలు, పరిస్థితి లను బట్టి అమలు చేసి నిర్వాసితులను ఆదుకోవాలని తెలిపింది,2025 సెప్టెంబర్ 27 వతేదీ న జరిగిన ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు కొరకు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో అందరూ అడిగిన దానికి స్పందించన జిల్లా కలెక్టర్ , కంపెనీ యాజమాన్యం ఆడపిల్లలకు ప్యాకేజీ చెల్లిస్తామని తెలిపారు అని గుర్తు చేశారు, వారు ఇచ్చిన హామీలు అమలు చేసి ఆడ పిల్లలకు ప్యాకేజీ అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.దుర్గ,టి.భవాని, ఎం.నూకరత్నం,టి.షిరీష,ఆర్.హైమావతి, ఆర్.వరలక్ష్మి,యు.మంగ, ఎం.నాగలక్ష్మి,టి.నాని, ఎం.వరలక్ష్మి, ఎస్.అశ్వని దుర్గ,నాగ హైమావతి,వీరదుర్గ తదితరులు పాల్గొన్నారు.



## జీవీఎంసీ ఆధ్వర్యంలో ప్రారంభమైన సమ్మర్ క్యాంప్

**అగనంపూడి (జయ జయహే)**

79 వ వార్డు అగనంపూడి జాబిల్లి హిల్స్ ఫౌండేషన్ ఆఫ్ ఏ వన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో జీవీఎంసీ నేతృత్వంలో సమ్మర్ క్యాంపును ఏ డి సి చైర్మన్ బలి రెడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలను అలవాటు చేసుకోవడం ద్వారా శరీర దృఢత్వం మానసిక ఉల్లాసం పెరుగుతాయని అన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ఈ అకాడమిలో కిక్ బాక్సింగ్ పై శిక్షణ ఇస్తారని అన్నారు. అకాడమీ కోచ్ కొమ్మోజి అశోక్ మాట్లాడుతూ జీవీఎంసీ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను 25 నుండి జూన్ 6 తారీకు వరకు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శిక్షణ కొనసాగుతుంది. శిక్షణకు వచ్చే విద్యార్థులకు ప్రతిరోజు గుడ్డు బిస్కెట్లు చెక్కి తో పాటు మంచినీరు అందజేస్తామని తెలిపారు ప్రతి ఒక్కరికి టీ షర్టు ఇవ్వడం జరుగుతుంది. విద్యార్థులకు ధ్రువ పత్రము ఇవ్వబడును అని అన్నారు కావున ఆసక్తి ఉన్న విద్యార్థులు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేసుకోవాలని కోరారు. జీవీఎంసీ సమ్మర్ క్యాంప్ 79 వ వార్డు ప్రశాంతినగర్ స్వర్ణ వార్డు అడ్మిన్ సెక్రెటరీ జి దిలీప్ సభ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 79 వ వార్డు టిడిపి అధ్యక్షులు కరణం జగదీష్ బిజెపి ఇన్చార్జ్ కోసూరి తాతారావు 79 వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు మేడిశెట్టి విజయ్ 79 వ వార్డు తెలుగు మహిళా అధ్యక్షురాలు గల్లా హానిత స్వర్ణ వార్డ్ వెల్ఫేర్ సెక్రెటరీ కే ఎన్ సుజాత, మాధవరావు, రమాదేవి యోగ ఇన్స్ట్రక్టర్ అనుష్క తేటకాలి మరియు శిక్షణ పొందే విద్యార్థులు పాల్గొన్నారు.

## పౌర సరఫరాల శాఖ సొసైటీ ఉద్యోగులపై అరాచకం తగదు

**అనంతగిరి (జయ జయహే)**



గిరిజన పౌర సరఫరాల శాఖ సొసైటీ ఉద్యోగులపై అరాచకం చేయడం తగదని కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కోనపురం గ్రామం సంబంధించిన డిఆర్ డిపోలో నేటికీ 90 రోజులు కావస్తున్న ఫిబ్రవరి 24 వ తారీకు నుంచి నేటికీ ఈ పాస్ మిషన్ నుంచి పేరు తొలగించ పోవడం దారుణం అన్నారు. జిల్లావ్యాప్తంగా 486 మంది డీలర్ సేల్స్ మెన్లు ఉన్నప్పుడు కేవలం అనంతగిరి మండలం కోనాపురం డిపోలోనే పేర్లు మార్చకపోవడంపై కక్షపూరితంగానే ఉద్దేశపూర్వకంగా వ్యవహరిస్తున్నట్టు స్పష్టంగా కనబడుతుంది. సబ్ కలెక్టర్ కార్యాలయంలో నుంచి సిహెచ్ డి టి ప్రశాంత్ అనంతగిరి మండలం తాసిల్దార్ ను సంప్రదించి ఇన్స్ట్రక్షన్ చేయమని మండల ఆర్ ఐ, వీఆర్వోలను కోనాపురం డిపోకు పంపించడం ఉద్దేశపూర్వకంగా చేస్తున్న చర్య అని తెలుస్తుంది. డ్వాక్రా సంఘం సభ్యురాలు శెట్టి నారమ్మ పేరు తొలగించకపోవడంతో ఏళ్ల తరబడి కమిషన్ ఉపాధి పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాస్ మిషన్ నుంచి పేరు తొలగించడం ఎన్ని రోజులు పడుతుందని ఆయన సూటిగా ప్రశ్నించారు. పదకొండు మండలల్లోని ప్రతి మండలంలో ముగ్గురు అనుచరులు ఉపయోగిస్తూ కొమ్ముకాస్తున్నారు అన్నారు. ఎవరు గట్టిగా అడిగిన వాళ్లను ఉద్యోగంలో నుంచి తొలగించే నెపంతో ఉన్నట్టు తెలుస్తుంది. సంబంధిత సివిల్ సప్లై జె సి, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఆయనపై తగు చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని శెట్టి రాజు తెలిపారు.



## జల విద్యుత్ కేంద్రం ఆధునీకరణపై ఇరు రాష్ట్రాలు ఇంత నిర్లక్ష్యమా..?

### ఒడిస్సా కోరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క ఆగ్రహం

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

చారిత్రాత్మకమైన ఆంధ్ర ఒడిస్సా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్ఖండ్ జల విద్యుత్ కేంద్రం ఆధునికరణ పనులపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇంత నిర్లక్ష్య ద్వారా వ్యవహరించడం చాలా విచారకరమని ఒడిశా కోరాపుట్ ఎంపీ సప్తగిరి ఉల్క ఆవేదన వ్యక్తం చేశారు. జల విద్యుత్ కేంద్రం అగ్ని ప్రమాదం కారణంగా దెబ్బతిన్నాదని విషయం తెలుసుకున్న ఆయన సోమవారం ఎంపీ సప్తగిరి ఉల్క కూడా మాచ్ఖండ్ జలవిద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. అత్యంత పురాతనమైన ఈ విద్యుత్ కేంద్రంలో ఇలాంటి ప్రమాదం జరగడం తీవ్ర బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఐదేళ్ల క్రితమే ఇరు రాష్ట్రాలు మాచ్ఖండ్ ఆధునికీకరణ కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇందుకోసం రూ. 800 కోట్లు వ్యయం చేయాలని నిర్ణయించినప్పటికీ.. నేటికీ పనులు ప్రారంభం కాకపోవడం విచారకరం." అని ఎంపీ వ్యాఖ్యానించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి ఈ విద్యుత్ కేంద్రం ఆధునికీకరణ పనులు వెంటనే ప్రారంభమయ్యేలా చూస్తామని ఎంపీ సప్తగిరి ఉల్క హామీ ఇచ్చారు. అలాగే మాచ్ఖండ్కు చెందిన విశాఖపట్నంలోని అతిథి గృహాన్ని (గెస్ట్ హౌస్) వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన జెన్ కో అధికారులను కోరారు.



## సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడొద్దు

### ప్లాస్టిక్ సంచులు వినియోగాన్ని మానేయండి

### జీవీఎంసీ సీఎంఓ డాక్టర్ నరేష్ కుమార్

**విశాఖపట్నం, మే 25, జయ జయహే**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి తీవ్ర హానికరమని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన తూర్పు జోన్ పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణ , పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సీతమ్మధార రైతు బజార్లో "ప్లాస్టిక్ వినియోగాన్ని స్వస్తి పలుకుతూ ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ వ్యాపారులు, దుకాణదారులు, స్థానిక ప్రజలకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులకు బదులుగా వస్త్ర సంచులు, నార సంచులు, పేపర్ బ్యాగులు, స్టీల్ కంటైనర్లు, బయోడిగ్రేడబుల్ ప్లేట్లు మరియు కప్పులను వినియోగించాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించి, సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన నగర నిర్మాణానికి పర్యావరణహిత అలవాట్లు ప్రతి ఒక్కరూ అలవరుచుకోవాలని తెలిపారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2025-26 లో విశాఖ నగరం పరిశుభ్ర నగరంగా , ప్లాస్టిక్ రహిత నగరంగా,పర్యావరణహిత నగరంగా దేశంలోనే ప్రథమ స్థానం పొందేందుకు వ్యాపారులు, కొనుగోలుదారులు ,ప్రజలు సహకరించాలని సీఎంహెచ్ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ బి. ప్రసాదరావు, శానిటరీ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, వార్డు శానిటేషన్ కార్యదర్శులు, మార్కెట్ వ్యాపారులు మరియు ఇతర జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

## రిగ్ బోర్ కోసం రోడ్డు నిర్మాణం చేసుకున్న గిరిజనులు

**అనంతగిరి జయ జయహే**



అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం రొంపిల్లి పంచాయతీ పరిధిలో మరలొవా గ్రామంలో 12 కుటుంబాలు కొండదొరకు తెగ చెందిన గిరిజనులు జీవనం సాగిస్తూ ఉన్నారు.మంచినీళ్లు కోసం కిలోమీటర్ల ప్రయాణించి. మా గ్రామానికి మంచినీరు సౌకర్యం కల్పించాలని. జిల్లా కలెక్టర్ ని వేడుకోగా. కలెక్టర్ స్పందిస్తూ మంచినీరు కోసం ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పరిశీలన చేశారు. రిగ్ బోర్ బండి వెళ్లాలంటే కనీసం రోడ్డు సౌకర్యం ఉండాలి. చెప్పడంతో గ్రామస్తులు రాత్రి మీటింగ్ ఏర్పాటు చేసుకొని. మనమే రోడ్డు నిర్మాణం చేసుకుంటే. బోరు తీసేందుకు రిగ్గు బండి వస్తుందని. చెప్పడంతో గిరిజనలు సొంతంగా పలువు పారా పట్టుకొని. ఆడుతూ పాడుతూ. తన గ్రామానికి నీరు సౌకర్యం కోసం సొంతంగా రోడ్డు ఫార్మేషన్ ఏర్పాటు చేసుకుంటున్నారు. మెయిన్ రోడ్డు నుండి తన గ్రామానికి రోడ్డు ఒక కిలోమీటర్ ఎత్తైన కొండ ఉండడంతో. బండ్రాళ్ళు తొలగిస్తూ రోడ్డు ఫార్మేషన్ చేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారి యంత్రాంగం. మాకు రోడ్డుకి ఉపాధి హామీ పథకం ద్వారా రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని. అనేకసార్లు అధికారులు కోరిన. కనీసం మా గ్రామంలో ఎక్కడుందో తెలియని పరిస్థితి. ఇప్పటికైనా మా గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి. మా పిల్లల చదువుకోవాలంటే గాదిలొవ గ్రామానికి నడుచుకుంటూ వెళ్తున్నారు. తుప్పలు దొంగల మధ్య. స్కూల్ కి వెళ్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్నాము. కంచురీ గంగులు. కంచురీ మహేష్. కొంచురి గంగమ్మ. గ్రామస్తులు పాల్గొన్నారుఅడవి తల్లి మాట పేరు మీద రోడ్డు మంజూరు చేయాలి. పి ఓ ఐ టి డి ఎ పాడేరు వారు మారుమూల గ్రామమైన మరలోవ గ్రామాన్ని సందర్శించాలి తక్షణమే రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని కోరారు



## మహానాడు పార్టీ సామగ్రి అందజేత

**విశాఖపట్నం, మే 25:(జయ జయహే)**

ఈనెల 27, 28 తేదీల్లో జరగనున్న మహానాడు వర్చువల్ సమావేశాలకు సంబంధించిన పార్టీ సామగ్రిని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో సోమవారం అందజేశారు. భీమిలి నియోజకవర్గంలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాలు, 1 నుంచి 8 వార్డులు, 98 వార్డు సహా మొత్తం 12 క్లస్టర్లు ఉన్నాయి. ప్రతి క్లస్టర్ లోనూ మహానాడు కార్యకలాపాలు వీక్షించడానికి వేదికలను ఏర్పాటు చేస్తున్నారు. పార్టీ దిశానిర్దేశం మేరకు ముఖ్య నాయకులు పాల్గొనున్నారు. పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన తోరణాలు, జెండాలు, కండువాలు, బ్యాడ్జీలు, టోపీలు తదితర సామగ్రిని ఆనందపురం, పద్మనాభం, జీవీఎంసీ 5, 6, 7 వార్డు పార్టీ శ్రేణులకు గంటా అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు చిక్కాల విజయ్ బాబు, తాత్రాజు అప్పారావు, కోరాడ రమణ, మొల్లి లక్ష్మణరావు, మాన్యాల సోంబాబు, కానూరు అచ్యుతరావు, సూరాల సత్య వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## గంటాను కలిసిన భీమిలి పార్టీ పరిశీలకుడు సురేంద్ర

**విశాఖపట్నం, మే 25:( జయ జయహే)**

భీమిలి నియోజకవర్గం టీడీపీ పరిశీలకుడిగా నియమితులైన అనకాపల్లికి చెందిన గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర సోమవారం భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 27, 28 తేదీల్లో 12 క్లస్టర్లలో జరగబోయే మహానాడు వర్చువల్ సమావేశాలు విజయవంతం చేయడంతో పాటు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఈ సందర్భంగా గంటా సూచించారు. భీమిలి టీడీపీ కంచుకోటని, రాబోయే రోజుల్లో తిరుగులేని శక్తిగా బలోపేతం చేయాలన్నారు.

## వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్తు సరఫరా

### - గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ వ్యవస్థకు నష్టం

### - పునరుద్ధరణ చర్యలు వేగవంతం

### - ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

**విశాఖపట్నం, మే 25, జయ జయహే**



ఏపీఈపీడీసీఎల్ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులు, ఉరుములు మెరుపుల కారణంగా శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, డా అంబేద్కర్ కోనసీమ, అనకాపల్లి, ఈస్ట్ గోదావరి జిల్లాల పరిధిలో విద్యుత్ వ్యవస్థకు గణనీయమైన నష్టం వాటిల్లినట్లు సంస్థ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా పలు ప్రాంతాల్లో భారీ వృక్షాలు విద్యుత్ లైన్లపై కూలిపోవడం వలన విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం, విద్యుత్ లైన్లు తెగిపోవడం వలన సరఫరా వ్యవస్థకు అంతరాయం కలిగిందన్నారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో 41 విద్యుత్ స్తంభాలు, పలు చోట్ల ట్రాన్స్ఫార్మర్లు, అనకాపల్లి, జగ్గంపేట డివిజన్ల పరిధిలో 279 విద్యుత్ స్తంభాలు, 31 ట్రాన్స్ఫార్మర్లు దెబ్బతిన్నాయని మరియు అనేక ప్రాంతాల్లో సుమారు 20 కిలోమీటర్ల విద్యుత్ లైన్లకు కూడా నష్టం సంభవించినట్లు వెల్లడించారు. సంఘటనలు చోటుచేసుకున్న వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందితో పాటు కాంట్రాక్ట్ సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా విభజించి, క్రేన్లు పోల్ డ్రిల్లింగ్ మెషిన్లు మరియు ట్రాక్టర్ల సహాయంతో అత్యంత క్లిష్ట పరిస్థితుల మధ్య, దెబ్బతిన్న విద్యుత్ స్తంభాల మార్పిడి, తెగిపోయిన లైన్ల పునరుద్ధరణ ప్రమాదకర వృక్షాల తొలగింపు వంటి పనులను వేగవంతంగా పూర్తి చేసి, విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసామని తెలిపారు. విద్యుత్ సరఫరా త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన సామగ్రి, యంత్రాలు, ట్రాన్స్ఫార్మర్లను ఆయా జిల్లాలో సమీకరించినట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెగిపోయిన విద్యుత్ తీగలు, దెబ్బతిన్న స్తంభాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా విద్యుత్ సంబంధిత ప్రమాదకర పరిస్థితులు గమనించినట్లయితే కాల్ సెంటర్ నెంబర్ 1912కు లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి వెంటనే సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో సహకరిస్తున్న సిబ్బందికి, సహనం పాటిస్తున్న వినియోగదారులకు సీఎండీ కృతజ్ఞతలు తెలిపారు.

## 'కాలుష్యరహిత గోదావరి పుష్కరాలు'

# నిర్వహణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది









### ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రానున్న గోదావరి పుష్కరాలను "కాలుష్యరహిత గోదావరి" థీమ్‌తో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గోదావరిలోకి కలిసే కాలుష్యకారక వ్యర్థాలు, మురుగునీటి ప్రవాహాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించి, సమస్యల మూలాలను గుర్తించి శాశ్వత పరిష్కారాల దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుష్కర ఘాట్ నుంచి కోటిలింగాల ఘాట్ వరకు పడవలో ప్రయాణించి గోదావరి తీర ప్రాంతాలను, కాలుష్య పరిస్థితులను, పుష్కరాల పనులను స్వయంగా పరిశీలించారు. గోదావరి గట్ల సుందరీకరణ పనులు, పుష్కరాల ఏర్పాట్లు, కాలుష్య నివారణ చర్యలపై అధికారులను వివరణ అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా చింతలమ్మ ఘాట్ వద్ద నల్లా ఛానల్ ద్వారా నగర మురుగునీరు గోదావరిలో కలిసే ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ స్వయంగా పరిశీలించారు. అక్కడ జరుగుతున్న మురుగునీటి శుద్ధి విధానం, వ్యర్థాలను వేరు చేసే ప్రక్రియను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం రోజుకు సుమారు 55 ఎంఎల్‌డీ మురుగునీరు గోదావరిలోకి చేరుతోందని అధికారులు వివరించగా, దీనిపై పవన్ కళ్యాణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

"మురుగునీటి శుద్ధి శాస్త్రీయ పద్ధతిలో జరగాలి. శుద్ధి చేయని నీటిని నేరుగా గోదావరిలోకి వదలడం వల్ల జలాలు కలుషితం అవుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలి" అని అధికారులను ఆదేశించారు. కాలుష్య నివారణలో నిజాయతీగా పనిచేయాలని, సమస్య ఎక్కడుందో స్పష్టంగా తెలుసుకుంటే పరిష్కారం ఆచరణలో సులభమవుతుందని పేర్కొన్నారు.

పుష్కరాల కోసం ఖర్చు చేసే ప్రతి రూపాయి ప్రజలకు ఉపయోగపడే విధంగా, గోదావరి నదిని పరిరక్షించే కార్యక్రమాలకు వినియోగించాలని పవన్ కళ్యాణ్ సూచించారు. ముందుగా కాలుష్యకారక అంశాలపై పూర్తిస్థాయి ఆడిట్ జరిపి, అనంతరం సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలోని ఎన్‌ఆర్‌సీపీ నిధుల కింద రూ.416 కోట్లలో ఇప్పటికే రూ.95 కోట్లకు పరిపాలన అనుమతులు వచ్చాయని, ఆ నిధులతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త ట్రీట్మెంట్ ప్లాంట్లు నిర్మించాలని సూచించారు.

ఈ సందర్భంగా ఆంధ్ర పేపర్ మిల్స్ విడుదల చేస్తున్న వ్యర్థజలాల అంశంపైనా ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఆరా తీశారు. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పేపర్ మిల్స్ నుంచి వచ్చే వ్యర్థాలను దూర ప్రాంత లంకల్లో విడుదల చేస్తున్నారని, దీనికి శాశ్వత ప్రత్యామ్నాయం కోసం సంస్థ చర్యలు తీసుకుంటోందని అధికారులు వివరించారు. ప్రత్యామ్నాయ శుద్ధి వ్యవస్థను వేగంగా అమలు చేయాలని, అవసరమైతే అదనపు శుద్ధి ప్లాంట్ నిర్మించేందుకు యాజమాన్యానికి ఆదేశాలు ఇవ్వాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

పడవ ప్రయాణం నుంచి మున్సిపల్ కార్యాలయానికి చేరుకునే వరకు గోదావరి కాలుష్య నివారణ చర్యలపై అధికారులతో ఉప ముఖ్యమంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం అమలులో ఉన్న శుద్ధి విధానాలు, భవిష్యత్తులో అనుసరించాల్సిన ఆధునిక సాంకేతిక పద్ధతులపై వివరణ కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంబిస్తూ అప్డేట్ కావాలని సూచించారు.

ఈ పర్యటనలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, ఎస్పీ నరసింహ కిషోర్, నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి తప్పిన పెను ప్రమాదం

### ఆ ఐదు నిమిషాల్లో ఏం జరిగిందంటే..!

### క్షణాల్లో చేరిన జ్వాలలు

### ఆ నలుగురు సాహసం అభినందనీయం

**ముంచంగిపుట్టు, జయ జయహే :**



కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు.. కానీ కొన్నిసార్లు ఆ కాలమే కాటేసే నిప్పులా మారుతుందని శనివారం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో జరిగిన ప్రమాదం నిరూపించింది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటల సమయం.. అంతా ప్రశాంతంగా ఉందనుకునే లోపే కాలయముడిలా మంటలు విరుచుకుపడ్డాయి. మంటలు చెలరేగిన కేవలం ఐదు నిమిషాల వ్యవధిలోనే.. ఊహించని వేగంతో అవి ప్రాజెక్టు అంతర్భాగంలోకి ప్రవేశించి అల్లకల్లోలం సృష్టించాయి.

**ఐదు నిమిషాల 'ప్రళయం' విద్యుత్ వేగంతో ప్రయాణం!**

భానుడి భగభగలకు తోడు లోకల్ ట్రాన్స్‌ఫార్మర్లలో ఉష్ణోగ్రత అమాంతం పెరిగిపోవడంతో ఒక్కసారిగా విసిబి ( విసిబి )లు పేలిపోయాయి. అక్కడ మంటలు అంటుకున్న మరుక్షణమే.. ప్రమాదం పొంచి ఉందనే విషయాన్ని గ్రహించే లోపే.. కేవలం ఐదు నిమిషాల్లోనే ఆ నిప్పుల జ్వాలలు కేబుళ్ల ద్వారా ప్రాజెక్టు మెయిన్ కంట్రోల్ రూమ్‌లోకి చొరబడ్డాయి.

ఐదే ఐదు నిమిషాలు.. కంటి రెప్పపాటు కాలంలో కంట్రోల్ రూమ్ అంతా దట్టమైన పొగలతో, నిప్పు కణాలతో నిండిపోయింది. కోట్ల విలువైన యంత్రాలు, మిషనరీ అగ్ని ఆహుతవుతూ ప్రాజెక్టు ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చాయి.

**అధికారుల వారించినా.. ఆగని ఆ 'నలుగురు'**

మంటలు ప్రాజెక్టు లోపలికి అంత వేగంగా ప్రవేశించడంతో లోపల ఉన్న సుమారు 15 మంది సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. వారిలో కొంతమంది బయటకు రాగా కొంతమంది లోపల ఉండి పోయారు. "మంటల తీవ్రత ఎక్కువగా ఉంది, ఎవరూ లోపలికి వెళ్లొద్దు" అంటూ ఉన్నతాధికారులు హెచ్చరించారు. అయితే విధులు నిర్వహించి బయట ఉన్న నలుగురు సిబ్బంది రవి, నరేష్, రుక్మన్, ఉమా శంకర్ లు తమ కళ్లముందే ప్రాజెక్టు బూడిదవుతుంటే చూస్తూ తట్టుకోలేకపోయారు. ఆ నలుగురు సిబ్బంది సాహసానికి సిద్ధపడ్డారు. అధికారులను రిక్వెస్ట్ చేసి మరీ అనుమతి పొందారు. ఊపిరాడకుండా చేస్తున్న దట్టమైన పొగను, ఒళ్లు కాల్చేస్తున్న వేడిని తట్టుకుంటూ ఆ నలుగురు ప్రాజెక్టు లోపలికి దూసుకెళ్లారు. చేతిలో టియర్ గ్యాస్ సిలిండర్లు, ఫోమ్ గ్యాస్ సిలిండర్లు పట్టుకుని సమయస్ఫూర్తితో, చాకచక్యంగా మంటలపై యుద్ధం చేశారు. ప్రాణాలను పణంగా పెట్టి వారు చేసిన ఆ ఐదు నిమిషాల పోరాటమే.. మాచ్‌ఖండ్ ప్రాజెక్టును ఒక మహా నష్టం నుంచి, శాశ్వత చీకటి నుంచి కాపాడింది. అలాగే ఆ నలుగురికి ప్రాజెక్ట్ సెక్యూరిటీ సిబ్బంది బబ్లు మఠం, నారాయణ కిముడు లతోపాటు ప్రాజెక్టు సిబ్బంది సూర్యప్రకాశ్, పితాంబరో పాత్రో, బివి. రమణ తదితరులు జత కలిశారు వీరంతా ఎంతో శ్రమించి మంటలను త్వరగా ఆర్పడంలో కీలకపాత్ర పోషించారు. వారు చూపిన సాహసం మాత్రం మాచ్‌ఖండ్ చరిత్రలో నిలిచిపోతుంది. వారి అప్రమత్తతను, ధైర్యాన్ని ఉన్నతాధికారులతో పాటు యావత్ ప్రజానీకం అభినందిస్తుంది.



# అంతర్‌రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు చర్చలలో పూర్తి ప్రాధాన్యత

### పరస్పర అవగాహనతోటే కృష్ణా జలాల వినియోగం

### రెండు రాష్ట్రాల త్రాగునీటి అవసరాలపై కలిసి పోయే విదంగా చర్యలు

### మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి

**జయజయహే**

నీటివినియోగంపై ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షణకు అనుకూలంగా ఉండే విధంగా రెండు రాష్ట్రాల మధ్యన ఒడంబడిక కుదుర్చుకుంటామని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణా-కర్ణాటక రాష్ట్రల మధ్యన కృష్ణా జలాల వినియోగం, త్రాగు,సాగునీటి అవసరాలపై కర్ణాటక రాష్ట్ర చిన్ననీటి తరహా శాఖామంత్రి బోసురాజు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తో డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సోమవారం రోజు భేటి అయ్యారు. భేటీలో రాష్ట్ర ఎక్సయిజ్ శాఖామంత్రి జూపల్లి కృష్ణారావు, పశుసంవర్ధక, క్రీడల శాఖామంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా శాఖా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి రాయచూరు లోకసభ సభ్యులు జీ. కుమార్ నాయక్,నాగర్ కర్నూల్ లోకసభ సభ్యులు మల్లు రవి లతో పాటు రాయచూరు రూరల్ శాసనసభ్యులు బసన్నగౌడ ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి,మేఘారెడ్డి,శివకుమార్ రెడ్డి,వంశీకృష్ణ,రాష్ట్ర నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్, ఇ. ఎన్.సి రమేశ్ బాబు,కర్ణాటక రాష్ట్ర చిన్నతరహా నీటిపారుదల శాఖా కార్యదర్శి బి.కే పవిత్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కృష్ణా జలాలను రెండు రాష్ట్రాల వినియోగంపై పరస్పర అవగాహనతో స్నేహపూర్వక వాతావరణంలో చర్చలు నిర్వహించామన్నారు. భవిష్యత్తులో అనుసరించ బోయే విధానాలు ఉభయ రాష్ట్రాలకు ప్రయోజనాకారిగే ఉండేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. తెలంగాణా రాష్ట్ర ప్రయోజనాలకు భంగం వాటిల్ల కుండా ఉండేలా అనుసరించాల్సిన ప్రతిపాదనలను కర్ణాటక చిన్న నీటి తరహా శాఖామంత్రి బోసురాజు కు సమగ్రంగా వివరించినట్లు ఆయన తెలిపారు.కృష్ణా నదిపై ప్రతిపాదిత బ్యారేజ్ నిర్మాణానికి సంబంధించిన సాంకేతికత అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణా సాగునీటి, త్రాగునీటి హక్కులు పరిరక్షణ భవిష్యత్ అవసరాలకు అనుసరించాల్సిన విధి విధానలపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు ఆయన తెలిపారు. అంతర్ రాష్ట్ర సమన్వయంతో త్రాగునీటి సమస్యకు శాశ్వతంగా పరిష్కారానికి రూపొందించిన ప్రతిపాదనలు కర్ణాటక ముందుంచినట్లు ఆయన చెప్పారు. కృష్ణా నది జలాశయాల వినియోగంపై జరిగిన ఉభయ రాష్ట్రాల చర్చలలో తెలంగాణా రైతాంగం సాగునీటి అవసరాలకు పూర్తి స్థాయిలో ప్రాధాన్యత ఇచ్చి చర్చించినట్లు ఆయన తెలిపారు.సాగునీటి, త్రాగునీటి విషయంలో రాష్ట్ర హక్కులకు భంగం వాటిల్ల కుండా ఉభయ రాష్ట్రాలకు సానుకూలంగా ఉండే విదంగా కృష్ణా జలాల వినియోగం పై కూలంకషంగా రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జాతిగాయని ఆయన తెలిపారు. రెండు రాష్ట్రాల మద్యన జరిగిన చర్చలను ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి వివరించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# విశాఖ ఉక్కును అమ్మి భూములు కొట్టేయాలనుకున్నారు

### మాజీ సిఎం జగన్‌పై అచ్చన్న సంచలన వ్యాఖ్యలు

**జయజయహే**

ఉక్కును నిర్వీర్యం చేయాలని గత వైసీపీ ప్రభుత్వం చూసిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె. అచ్చెన్నాయుడు విమర్శించారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసి.. ఆ విలువైన భూములను ఆక్రమించుకోవాలని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కుట్ర పన్నారని పేర్కొన్నారు. అధికార దాహంతో ఉక్కు భూములను ఆక్రమించాలని వైఎస్ జగన్ చూశారని మండిపడ్డారు. తన స్వార్థం కోసం వైఎస్ జగన్ ఎవరినైనా బలి చేస్తారన్నారు. సోమవారం శ్రీకాకుళంలో మంత్రి కె. అచ్చెన్నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిరక్షణకు ఆంధప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నడుం బిగించారని తెలిపారు. ఈ ఉక్కు పరిశ్రమ కోసం కేంద్రాన్ని ఒప్పించి రూ.15 వేల కోట్ల నిధులను సీఎం చంద్రబాబు మంజూరు చేయించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు ఓ బ్రాండ్ అని అభివర్ణించారు. సీఎం చంద్రబాబు విజన్‌కు ఆకర్షితులైన పారిశ్రామిక దిగ్గజాలు ఆంధప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నాయన్నారు. గూగుల్, రిలయన్స్, మిట్టల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని చెప్పారు. గత వైసీపీ పాలనలో కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలను వేధించడమే కాకుండా.. భయభ్రాంతులకు గురి చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వైసీపీని శాశ్వతంగా పాతాళానికి పంపుతామని స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారు.. రాష్ట్రానికి దండం పెట్టి వెనుదిరిగారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నీకెంత - నాకెంత అన్నట్లుగా పాలన సాగేదని వివరించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి స్థానం లేదని కుండబద్దలు కొట్టారు. అధికారం కోసం సొంత బాబాయినే అడ్డంగా నరికేశారని వైఎస్ జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com